PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 21 | విజయవాడ, సోమవారం 21 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 21 August 2023 | Rs

ఉత్తరప్రదేశ్‌లో మరో ఘాతుకం

- ముస్లిం దంపతుల దారుణ హత్య

లోపలి పేజీలో..

సిరీస్ సొంతమాయె

- రెండో టీ20లో భారత్ గెలుపు
- రాణించిన రుతురాజ్, బుమ్రా

లోపలి పేజీలో..

పాడేరులో పెను ప్రమాదం

ఘాట్‌రోడ్డులో అదుపుతప్పి 100 అడుగుల లోయలో ఆర్‌టిసి బస్సు

ఇద్దరు మృతి

26 మందికి గాయాలు

ముఖ్యమంత్రి జగన్ దిగ్భ్రాంతి

లోయలోకి పడిపోయిన బస్సు

ప్రజాశక్తి- పాడేరు టౌన్

అల్లూరి సీతారామరాజు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పాడేరు ఘాట్ రోడ్డులో చెట్టు కొమ్మను ఢీకొని లోయలో ఆర్‌టిసి బస్సు పడిపోవడంతో ఇద్దరు మృతి చెందారు. 26 మంది గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈ ప్రమాదం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి రాజన్న దొర తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం జరిగిన ఈ ప్రమాద ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.... పాడేరు డిపోకు చెందిన శ్రీ స్టాఫ్ బస్సు విశాఖపట్నం నుంచి పాడేరు వెళ్తుండగా సాయంత్రం మూడున్నర గంటల సమయంలో ఘాట్ రోడ్డులోని వ్యూపాయింట్‌కు సమీపంలో ఓ మలుపునకు ఎడమ వైపు వేలాడుతున్న చెట్టు కొమ్మను ఢీకొట్టి కుడివైపున ఉన్న లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం బరిసింగి పంచాయతీ జి.కొత్తూరు గ్రామానికి చెందిన సీసా కొండన్న (52), అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం సూరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నవర నారాయణమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందారు. ముంచంగిపుట్టు మండలం సరియాపుట్టు గ్రామానికి చెందిన కిల్లో బోద్‌రాజుకు మిగతా 2లో

లారీని ఢీకొన్న కారు

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి- చెన్నూరు (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా చెన్నూరు మండలంలోని కడప-కర్నూలు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. వారిలో తెలంగాణ రాష్ట్రం ఖైరతాబాద్‌కు చెందిన కొండేటి కృష్ణ (48), ఆయన కుమారుడు రిషి (15), అత్త పద్మావతి (60) ఉన్నారు. కృష్ణ భార్య విజయవాణి, కుమార్తె నిహారిక తీవ్రంగా గాయపడ్డారు. కృష్ణ తన తండ్రి కర్మకాండల కోసం కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వచ్చి కార్యక్రమం అనంతరం తిరిగి వెళు న్నారు. వారు ప్రయాణిస్తున్న కారు గోసుల కల్యాణ మండపం సమీపంలో ఆంధ్ర స్పైస్ వద్ద చెట్టు కింద ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. దీంతో, విషాదం చోటుచేసుకుంది.

ఇంఫాల్ క్యాథలిక్ చర్చి పెద్ద రెవ డాక్టర్ డొమినిక్ ల్యూమన్‌తో ఏచూరి నేతృత్వంలోని సిపిఎం ప్రతినిధి బృందం

చర్చలే ఏకైక మార్గం

మణిపూర్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వాల ఘోర వైఫల్యం

- సహాయక శిబిరాల్లో కనీస సౌకర్యాల్లేవు
- పార్లమెంటరీ బృందాన్ని పంపాలి : ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో సంక్షోభం పరిష్కారానికి చర్చలే ఏకైక మార్గమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. కుకీలు, మెయితీలతో చర్చలు ప్రారంభించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. సీతారాం ఏచూరి నేతృత్వంలో సిపిఎం త్రిపుర, అస్సాం రాష్ట్ర కార్యదర్శులు జితేంద్ర చౌదరి, సుప్రకాష్ తాలూక్దార్, కేంద్ర కమిటీ సభ్యులు డెబ్లీనా హెంబ్రామ్‌లతో కూడిన బృందం మూడు రోజుల మణిపూర్ పర్యటన ఆదివారం ముగిసింది. బృందం సభ్యులు మూడు రోజుల పాటు కుకీ, మెయితీ సహాయక శిబిరాలను సందర్శించారు. వారికి భరోసా ఇచ్చారు. రాష్ట్ర గవర్నర్ అనసూయ ఉయికేను కలిసి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లౌకిక రాజకీయ పార్టీల నేతలను కలిసి శాంతి కోసం చర్యలు చేపట్టా లని కోరారు. కుకీ, మెయితీ, నాగా జాతుల నేతలను కూడా కలిశారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితి, శాంతి కోసం అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని సూచించారు. ఈ బృందంతోపాటు సిపిఎం మణిపూర్ రాష్ట్ర కార్యదర్శి క్షత్రిమయుమ్ శాంత కూడా ఉన్నారు.

మణిపూర్ రాజధాని ఇంఫాల్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీతారాం ఏచూరి మాట్లాడారు. మూడు నెలలుగా కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించడంలో బిజెపి 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా శాంతి నెలకొల్పేందుకు గట్టి చర్యలు చేపట్టాలని కోరారు. "చర్చలు జరగాలి. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ప్రాథమిక బాధ్యత వహించాలి. ఇది డబుల్-ఇంజిన్ ప్రభుత్వం అయితే, దయచేసి ప్రతి ఒక్కరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడానికి ప్రయత్నించండి. రెట్టింపు శక్తితో ప్రయత్నాలు చేయండి. గతంలో ఇలాగే చేశాం. 75 ఏళ్లలో భారతదేశం ఎదుర్కొన్న సమస్యలన్నిటికీ పరిష్కారం లభించిన ఏకైక మార్గం ఇది" అని ఆయన అన్నారు. చర్చలకు నిరాయుధీకరణ ముందస్తు షరతుగా ఉండాలని, కాల్పుల మిగతా 2లో

'చిత్రావతి' పనులకు గ్రహణం

- లక్ష ఎకరాల స్థిరీకరణకు బ్రేక్
- నిధుల కొరతే కారణం

లోపలి పేజీలో..

చంద్రునిపై కూలిన 'లూనా-25'

- చివరి మజిలీలో విఫలమైనట్లు ప్రకటించిన రష్యా

మాస్కో : సుమారు 47 ఏళ్ల తర్వాత రష్యా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొలి మూన్ మిషన్ లూనా-25 అంతరిక్ష నౌక చంద్రుడిపై కూలిపోయింది. ల్యాండింగ్‌కు ముందు విన్యాసాల సమయంలో చంద్రునిపై అంతరిక్ష నౌక కూలిపోయిందని రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ ఆదివారం తెలిపింది. శనివారం మధ్యాహ్నం 2.57 గంటలకు లూనా-25 కమ్యూనికేషన్ కోల్పోయిందని రోస్‌కాస్మోస్ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రాథమిక పరిశోధనల ప్రకారం.. ల్యాండర్ చంద్రుని ఉపరితలాన్ని ఢీకొన్న తర్వాత ఉనికిలో లేదని తెలిపింది. అంతరిక్ష నౌకను గుర్తించి, కమ్యూనికేట్ చేసేందుకు ఈ నెల 19, 20 తేదీల్లో తీసుకున్న చర్యలు విఫలమయ్యాయని వివరించింది. రష్యాలోని వోస్తోక్నీ కాస్మోడ్రోమ్ నుంచి ఈ నెల 11న 'లూనా-25'ని ప్రయోగించింది. పదిరోజులపాటు ప్రయాణించిన ల్యాండర్ కొన్ని గంటల క్రితమే చంద్రుడి ఫొటోలను పంపించింది. ఈ నెల 21న చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండ్ కావాల్సి ఉంది. అందుకోసం కక్ష్య (ప్రీ ల్యాండింగ్ ఆర్బిట్)కు చేరడానికి కీలక విన్యాసం చేపట్టే ప్రయత్నంలో లూనా-25లోని ఆటోమేటిక్ స్టేషన్‌లో అత్యవసర పరిస్థితి తలెత్తినట్లు రోస్‌కాస్మోస్ గుర్తించింది. అప్పటికే ల్యాండర్‌తో సంబంధాలు తెగిపోయినట్లు తెలిపింది. ల్యాండర్ కూలిపోవడానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించనున్నట్లు పేర్కొంది.



దేవీపట్నం మండలంలో గండిపోశమ్మ ఆలయంలోకి చేరిన వరద నీరు

స్వల్పంగా పెరిగిన గోదావరి

- భద్రాచలం వద్ద 21.60 అడుగుల నీటిమట్టం
- గండిపోశమ్మ ఆలయంలోకి ప్రవేశించిన వరద నీరు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరికి వరద స్వల్పంగా పెరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా గండిపోశమ్మ ఆలయంలోకి వరద నీరు చేరింది. ఆదివారం నాటికి భద్రాచలం వద్ద 21.60 అడుగుల నీటిమట్టం నమోదైంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 10.50 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. కాటన్ బ్యారేజీ నుంచి 1.20 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. తూర్పు డెల్టా కాలువకు 4,500 క్యూసెక్కులు, మధ్య డెల్టా కాలువకు 2 వేల క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం కాఫర్ డ్యాం బ్యాక్ వాటర్ కారణంగా వరద నీరు ఎగదన్నుతోంది. శనివారం నాటికి గండిపోశమ్మ ఆలయం వద్దకు వెళ్లే దారిపై వరద నీరు చేరింది. ఆదివారం సాయంత్రానికి ఆలయంలోని అమ్మవారి విగ్రహం వరకూ వరద నీరు ప్రవేశించింది. దీంతో, అధికారులు అప్రమత్తమయ్యారు. ఆలయ సమీపంలో దుకాణాలను మూయించారు. వరద పెరుగుతున్న దృష్ట్యా గండిపోశమ్మ ఆలయంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపేశామని ఆలయ అధికారులు తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా పాపికొండల విహార యాత్రకు వెళ్లే బోట్లను ఎక్కడికక్కడ ఒడ్డుకు నిలిపేసినట్టు తెలిపారు. వరద పెరగడంతో దేవీపట్నం మండలం తాళ్లూరులో 50 కుటుంబాలు కొండలు, గుట్టలపైకి చేరాయి.

సిడబ్ల్యుసి సభ్యునిగా రఘువీరారెడ్డి

- తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురికి అవకాశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి)ని పునర్వ్యవస్థీకరించారు. ఆదివారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో నిర్ణయాలు తీసుకునే అత్యున్నత స్థాయి వ్యవస్థ అయిన సిడబ్ల్యుసి సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ నుంచి రఘువీరారెడ్డి నియమితులయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి సిడబ్ల్యుసి శాశ్వత ఆహ్వానితులుగా టి.సుబ్బిరామిరెడ్డి, కె.రాజు, దామోదర రాజనర్సింహకు అవకాశం లభించింది. ప్రత్యేక ఆహ్వానితులుగా పల్లం రాజు, వంశీచంద్‌రెడ్డి నియమితులయ్యారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 79వ జన్మదినమైన ఆదివారం సిడబ్ల్యుసిని పార్టీ అధ్యక్షుడు ఖర్గే పునర్వ్యవస్థీకరించారు.

ప్రజల గొంతు వినండి!

జి-20 దేశాధినేతలకు వియ్-20 పిలుపు

ప్రజాస్వామిక శక్తుల ఐక్యతతోనే సమానత్వం • డిక్లరేషన్ ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మార్కెట్ శక్తుల ప్రయోజనాలకే పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సామాన్య ప్రజల సమస్యలపై కూడా చర్చించాలని జి-20 దేశాధినేతలను 'వియ్-20 సమ్మిట్' కోరింది. ఈ మేరకు ఏకగ్రీవంగా ఆమోదించిన డిక్లరేషన్‌ను ఆదివారం విడుదల చేసింది. జి-20 సమావేశాలకు హాజరయ్యే నాయకులు ప్రజల గొంతును వినాలని, వారి ప్రాధాన్యతలు గుర్తించాలని సూచించింది. ప్రజల అజెండా లేకుండా జరిగే చర్చల వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని పేర్కొంది. అదే సమయంలో ప్రజాస్వామిక శక్తుల ఐక్యతతతోనే సమానత్వం సాధ్యమవుతుందని తెలిపింది. ' ప్రజా ఉద్యమాలు, పౌర సమాజ సంస్థలు, మానవ హక్కుల కార్యకర్తలు, అన్ని రకాల ప్రగతి శీల శక్తుల మధ్య పూర్తిస్థాయి ఐక్యత, సంఘీభావ సాధనే కర్తవ్యం. అప్పుడు మాత్రమే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజానీకానికి సమ్మిళిత, పారదర్శకత్వం, న్యాయంతో కూడిన సమానత్వ భవిష్యత్తును అందించగలం' అని డిక్లరేషన్ ప్రకటించింది. సెప్టెంబర్ మొదటి వారంలో జరిగే జి-20 శిఖరాగ్ర సదస్సును పురస్కరించుకుని, ప్రజల గొంతును వినిపించడానికి ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో ఈ సదస్సును నిర్వహించిన సంగతి తెలిసిందే. శుక్రవారం నుండి మూడు రోజుల పాటు ఈ సదస్సు జరగాల్సిఉండగా, రెండవ రోజైన శనివారం పోలీసులు అడ్డుకున్నారు.ఈ చర్యకు తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో మిగతా 2లో

ఆరోగ్య హక్కు చట్టం ద్వారానే

అందరికీ ఆరోగ్యం

- ప్రజారోగ్య వేదిక రౌండ్ టేబుల్‌లో రిటైర్డ్ ఐఎఎస్ పివి రమేష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యాంగం ప్రకారం ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించే హక్కు ఉన్నప్పటికీ పేదవారికి సరైన వైద్యం అందడం లేదని రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మాజీ ముఖ్యకార్యదర్శి డాక్టర్ పివి రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్య హక్కు చట్టం ద్వారానే అందరికీ ఆరోగ్యం సాధ్యమని అన్నారు. ఆదివారం విజయవాడలోని ఎంబివికెలో అందరికీ ఆరోగ్యం కావాలంటే ఆరోగ్య హక్కు చట్టాన్ని తేవాలని కోరుతూ ప్రజారోగ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ కెవి సాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ పివి రమేష్ మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంగా లేకుండా దేశం అభివృద్ధి జరగదనేది ప్రపంచ అనుభవాలు చెబుతున్నాయన్నారు. ప్రజలు పెరిగిన వైద్య ఖర్చులతో వైద్యం చేయించుకోలేక పోతున్నారని అన్నారు. అందుకు అయ్యే ఖర్చును భరించలేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి పేదవారిగా మారుతున్న పరిస్థితి దేశవ్యాప్తంగా వుందని తెలిపారు. వైద్య ఖర్చులు పెరిగిపోవడం రాష్ట్రంలో మరింత ఎక్కువగా వుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఈ పరిస్థితి నుంచి బయట పడాలి అంటే తప్పక ఆరోగ్య హక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జిడిపిలో 1.4శాతాన్ని మాత్రమే బడ్జెట్‌లో కేటాయిస్తున్నారని కనీసంగా నాలుగు శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీలు, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌లు ఉన్నంత మాత్రాన చాలదని చెప్పారు.వైద్యం అన్నది హక్కుగా ఉండాలన్నారు. జబ్బు వచ్చిన తర్వాత వైద్యం చేయడం ఎంత అవసరమో జబ్బులు రాకుండా చూసుకోవడం మరింత అవసరమని అన్నారు. జబ్బులు రాకుండా చేయడంలో ప్రభుత్వం బాధ్యత ఎక్కువ వుంటుందని తెలిపారు. ఆరోగ్య వ్యవస్థను బాగు చేయాలంటే వైద్య విద్యపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని, మెడికల్ కళాశాలలు నిర్మించడమే కాదు అందులో జరిగే బోధన డాక్టర్ల శిక్షణ మీద కూడా ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాలన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యను, నర్సుల శిక్షణను, పారామెడికల్ కోర్సుల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ హెల్త్ అథారిటీ విభాగాన్ని ఏర్పాటు చేసి వైద్య విద్య ప్రమాణాలను మెరుగు పెంచాలని సూచించారు.మాజీ ఎంపి పి మధు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం, సమాచార హక్కు చట్టం తరహాలో ఆరోగ్యహక్కు చట్టం కూడా వుండాలని అన్నారు.మానవాభివృద్ధి లేకుండా దేశం అభివృద్ధి చెందదన్నారు. వైద్య రంగం మొత్తం ప్రభుత్వంలోనే వుండాలని అన్నారు. పిహెచ్‌సిలను, ప్రివెంటెవ్ కేర్, క్యురేటివ్‌కేర్‌లను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. కీలకమైన పిహెచ్‌సిలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి రమణయ్య మాట్లాడుతూ ప్రజల చేతిలో డబ్బులేనపుడు ఎమర్జన్సీ పరిస్థితి వచ్చినపుడు ప్రభుత్వ ఆసుపత్రి అందుబాటులో లేకుండా చాలా ఇబ్బందిగా వుంటుందని తెలిపారు. ఆరోగ్య హక్కు చట్టం వస్తే ప్రతి హాస్పిటల్‌లో ఎమర్జన్సీ సేవలు ఉచితంగా అందించే పరిస్థితి వుంటుందని అన్నారు. కీలకమైన ఈ డిమాండ్‌ను రాజకీయ అజెండాగా మార్చేలా పార్టీలు తమ ఎన్నికల మెనిఫెస్టో చేర్చాలని ప్రజలందరూ డిమాండ్ చేయాలని కోరారు.కార్యక్రమంలో ప్రజారోగ్యవేదిక నాయకులు జి విజయ్ ప్రకాష్, ఐఎంఎ నాయకులు హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విజయవాడలో

ఎపి ఎన్‌జిఓ 21వ రాష్ట్ర మహాసభలు

ప్రారంభించనున్న సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం 21వ రాష్ట్ర మహాసభలు ఈనెల 21,22 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరుగునున్నాయి. మహాసభలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. సిఎం సోమవారం మద్యాహ్నం 12.05 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఎన్‌జీఓస్ మహాసభల వేదిక ప్రాంగణమైన ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియానికి చేరుకుంటారు. అనంతరం మహాసభను ప్రారంభించి ఉద్యోగులనుద్దేశించి ప్రసంగిస్తారు. మహాసభలకు సిఎంతో పాటు పలువురు మంత్రులు, క్యాబినెట్ సబ్‌కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. మహాసభల ఏర్పాట్లు, సభల్లో చేయనున్న తీర్మానాల గురించి ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి శివారెడ్డి మీడియాతో ఆదివారం మాట్లాడారు. మూడు సంవత్సరాలకొకసారి జరగాల్సిన మహాసభలు జరపడం కోవిడ్ కారణంగా ఆలస్యమైందన్నారు. సంఘం స్థితి గతులు, బైలాలో మార్పులు, చేర్పులు అవసరమైతే వాటిని మహాసభ ఆమోదంతో అమలు చేయడమే ఈ మహాసభల ముఖ్య ఉద్ధేశ్యమన్నారు. గజిటెడ్ ఉద్యోగులను సంఘ సభ్యులుగా చేసుకునే విధంగా మార్పు చేసేందుకు అవసరమైతే సంఘం పేరును కూడా కొద్దిగామార్పు చేయాలనే ఆలోచన ఉందన్నారు. గజిటెడ్ ఉద్యోగులు సభ్యులుగా చేరిన అనంతరం ఎపి ఎన్‌జిఒ సంఘం ఎపి ఎన్‌జిజిఒ సంఘంగా పేరు మారుతుందన్నారు. ఎ పి ఎన్‌జిఒ బైలాస్ పదవుల్లో 33శాతం మహిళలకు అవకాశం కల్పించేలా మహాసభలో తీర్మానాలు చేస్తామన్నారు. . ఇప్పటి వరకు 11 పిఆర్‌సిలు సాధించామని, మెరుగైన 12వ పిఆర్‌సిని సైతం ఎపి ఎన్‌జిఒ సంఘంసాధిస్తుందన్నారు. మహాసభలకు పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలి రావాలని, ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించి మహాసభను విజయవంతం చేయాలని బండి శ్రీనివాసరావు, కెవి శివారెడ్డి కోరారు.

ఉరవకొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారిపై

సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా పరిషత్ సిఇఒ కె.భాస్కర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో ఓట్ల తొలగింపులో నిబంధనలు పాటించని కారణంగా ఆయనను సస్పెండ్ చేస్తూ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఈ నెల 19న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో 2020, 2021 సంవత్సరంలో ఓటర్ల జాబితా తయారీలో 1,116 ఓట్లను తొలగించారు. ఆ సమయంలో కె.భాస్కర్‌రెడ్డి అక్కడ ఎన్నికల రిటర్నింగు అధికారిగా పనిచేశారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఫిర్యాదు మేరకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించి ఓటర్ల జాబితాను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లను తొలగించారని నిర్ధారణకు వచ్చారు. దీనిపై తదుపరి విచారణ కూడా చేపట్టారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు భాస్కర్‌రెడ్డిని చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సస్పెండ్ చేసింది. ఇదివరకే ఇద్దరు బిఎల్‌ఒలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. మరికొంతమందిపైనా వేటు పడే అవకాశాలున్నట్టు సమాచారం.

వైసిపి కార్యాలయాలకు టులెట్ బోర్డు ఖాయం

- టిడిపి నేత యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి క్లీన్ స్వీప్ చేస్తుందని, రాష్ట్రంలోని వైసిపి కార్యాలయాలకు టూ లెట్ బోర్డు పెట్టుకోవడం ఖాయమని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు యనమల రామకృష్ణుడు తెలిపారు. 2024 ఎన్నికల ముందే వైసిపిని రాష్ట్రం నుంచి గెంటేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్న సంకేతం పంచాయితీలకు జరిగిన ఉప ఎన్నికల ద్వారా వెల్లడైందన్నారు. ప్రజలు టిడిపి పక్షాన నిలబడటాన్ని వైసిపి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. బుర్రిపాలెంలో 1,526 ఓట్ల మెజార్టీతో టిడిపి అభ్యర్థి గెలవడం ప్రజల్లో మార్పునకు నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

చంద్రబాబుతో యార్లగడ్డ భేటీ

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో

గన్నవరం వైసిపి సమన్వయ కర్త యార్లగడ్డ వెంకట్రావు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ఆయనను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడిపిలో చేరడం ఖాయమని, అధిష్టానం రాష్ట్రంలో ఎక్కడి నుంచి పోటీ చేయమని ఆదేశించినా టిడిపి తరపున బరిలో నిలుస్తానని ఆయన అన్నారు. గుడివాడ నుంచి అయినా, విజయవాడ నుంచి అయినా సరే పోటీ చేసేందుకు తాను సిద్ధమని తెలిపారు. యార్లగడ్డ ఇటీవల వైసిపిని వీడిన సంగతి తెలిసిందే. ఈ నెల 23న టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ సమయంలో యార్లగడ్డ టిడిపిలో చేరే అవకాశముంది.

పేదరిక నిర్మూలనకు రాజీవ్ కృషి

- గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో ఆదివారం పిసిసి ఆధ్వర్యంలో రాజీవ్ 79వ జన్మదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రరత్నభవన్ నుంచి సింగ్ నగర్ ఫ్లై ఓవర్ దగ్గరున్న రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో గిడుగు మాట్లాడుతూ దూరదృష్టితో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి రాజీవ్ బాటలు వేశారని కొనియాడారు. కాగా గిడుగు సమక్షంలో టిడిపి నేత, విజయవాడ 10వ డివిజన్ మాజీ కార్పొరేటర్ నజీర్ హుసేన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మస్తాన్‌వలి, సుంకర పద్మశ్రీ, నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, ఎఐసిసి సభ్యులు కొలనుకొండ శివాజి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఏనుగు మృతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

విద్యుదాఘాతంతో ఏనుగు మృతిచెందిన సంఘటన చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలోని అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. నెల్లిపట్ల గ్రామం అటవీ ప్రాంతంలోని వ్యవసాయ పొలాల వద్దకు తరచూ ఏనుగులు గుంపులుగా వచ్చి పంటలపై దాడి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఏనుగుల గుంపు పంట పొలాల్లో సంచరిస్తుండగా అయ్యప్పనాయుడు అనే రైతు పొలంలోని విద్యుత్ స్తంభాన్ని ఓ ఏనుగు ఢీకొట్టింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మతి చెందింది. అటవీ శాఖ అధికారులు ఆదివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని ఏనుగుకు శవపరీక్ష నిర్వహించారు. ఇకనైనా అధికారులు స్పందించి ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల్లో తగుచర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

చర్చలే ఏకైక మార్గం

(మొదటి పేజీ తరువాయి)

విరమణ తక్షణమే పాటించాలని ఏచూరి సూచించారు. రాష్ట్రానికి పార్లమెంటరీ ప్రతినిధి బృందాన్ని వెంటనే పంపాలని కేంద్రాన్ని కోరారు. అఖిలపక్ష బృందాన్ని పంపాలని ప్రతిపక్షాలు ఇప్పటికే పలుమార్లు కోరినా కేంద్రం పెడచెవిన పెట్టిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలతో కూడా సమావేశం నిర్వహించాలని, హింసాకాండలో బాధితుల కోసం ఏర్పాటు చేసిన సహాయక శిబిరాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏచూరి కోరారు.

మణిపూర్‌కు సిపిఐ ప్రతినిధి బృందం

ఈ నెల 21 నుంచి 24 వరకూ సిపిఐ ప్రతినిధి బృందం మణిపూర్‌లో పర్యటించనుంది. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, రాజ్యసభ ఎంపి బినయ్ విశ్వం, సిపిఐ జాతీయ కార్యదర్శులు కె. నారాయణ, రామకృష్ణ పాండా, సిపిఐ అస్సాం సీనియర్ మహిళ నేత అసోమి గొగోయ్ ఈ బృందంలో ఉంటారు.

సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు : ఎస్ఎఫ్ఐ

- విశాఖ, ఏలూరు జిల్లాల్లో ముగిసిన సైకిల్ యాత్రలు

ప్రజాశక్తి - విశాఖపట్నం/ఏలూరు అర్బన్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ చేపట్టిన సైకిల్ యాత్రలు విశాఖ, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆదివారంతో ముగిశాయి. రెండు రోజులపాటు సాగిన సైకిల్ యాత్రలో భాగంగా నేతలు పలు హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. మెస్ ఛార్జీలు పెంచడంలేదని, ప్రస్తుతం ఇస్తున్న బిల్లులకు మార్కెట్లో ఉన్న ధరలకు చాలా వ్యత్యాసం ఉంటుందని, నాణ్యమైన ఆహారం అందించడంలేదని, దోమ తెరలు కూడా ఇవ్వడంలేదని, నీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

విశాఖలో చేపట్టిన 'విద్యార్థి సంఘర్షణ సైకిల్ యాత్ర' ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. నగరంలోని ఎంవిపి.కాలనీ, సీతమ్మధార, పాత పోస్టాఫీసు, కప్పరాడ, మాధవధార ప్రాంతాల్లోని ప్రభుత్వ వసతి గృహాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. పిజి విద్యార్థులకు విద్యా దీవెన అమలు చేయాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సైకిల్ యాత్రలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, జిల్లా నాయకులు శశి కుమార్, గుణశేఖర్, కౌశిక్ పాల్గొన్నారు.

ఏలూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఏలూరులో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ.. వసతి గృహాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయని, విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు దోమతెరలు కూడా ఇవ్వకపోవడంతో రాత్రి సమయాల్లో నిద్రలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నంబర్ 77 వల్ల పేద విద్యార్థులు పిజి వంటి ఉన్నత విద్యకు దూరమయ్యారని, ఈ జిఒ ప్రకారం ప్రయివేటు కళాశాలల్లో చదివేవారికి ఉపకార వేతనాలు నిలిపివేస్తున్నారని, ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునేందుకు జిల్లాలో ప్రభుత్వ పిజి కళాశాలలు లేవని తెలిపారు. వసతి గృహాలకు సొంతభవనాలు లేక అద్దె భవనాల్లో కాలం వెల్లదీస్తున్నారన్నారు. హాస్టల్‌లో సరైన రక్షణ లేకుండా ఉందని తెలిపారు.

సముద్రంలో బోటు బోల్తా

- తల్లి, ఇద్దరు బిడ్డలు గల్లంతు
- ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరిన తండ్రి

ప్రజాశక్తి-నిజాంపట్నం (బాపట్ల జిల్లా)

బోటు బోల్తా పడి ఓ కుటుంబం సముద్రంలో మునిగిపోగా.. తండ్రి ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరాడు. తల్లి, ఇద్దరు బిడ్డలు గల్లంతయ్యారు. ఈ ఘటన నిజాంపట్నం హార్బర్‌లో ఆదివారం జరిగింది. నిజాంపట్నం సిఐ రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా నాగాయలంక మండలం ఏల్చేటి దిబ్బ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ సోంబాబు, ఆయన భార్య సాయివర్ధిక (25) వారి వద్దనున్న చిన్న బోటుపై ఇద్దరూ వేటకు వెళ్లి వచ్చి మత్స్య సంపద అమ్ముకొని జీవనం సాగిస్తూ ఉంటారు. వీరికి ఇద్దరు కుమారులు తనీష్‌కుమార్ (7), తరుణేశ్వర్ (11 నెలలు) ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ ఇంటి వద్ద పిల్లల సంరక్షణ చూసుకునే వారు లేక వారినీ తమతో పాటు వేటకు తీసుకుని వెళ్లారు. ఎప్పటిలాగే వేట చేసుకొని వచ్చారు. మత్స్య సంపదను అమ్ముకునే క్రమంలో ఆదివారం సముద్రం నుండి నిజాంపట్నం హార్బర్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా పెద్ద అలలు రావటంతో బోటు అదుపుతప్పి అక్కడ ఉన్న రాళ్లకు ఢీకొని తిరగబడింది. దీంతో బోటులో ఉన్న నలుగురూ సముద్రంలో పడిపోయారు. సోంబాబు ఈత కొట్టుకుంటూ ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్నాడు. తల్లీ బిడ్డలు ముగ్గురు గల్లంతయ్యారు. రాత్రివరకూ వారి ఆచూకీ తెలియలేదు. గల్లంతైన వారికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

వాస్తవికతకు మరో రూపం ఫొటోగ్రఫీ : బత్తుల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాస్తవికతకు మరో రూపం ఫొటోగ్రఫీ అని మార్కెటింగ్ డిపార్ట్మెంట్ ప్రభుత్వ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం విజయవాడలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు 'ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ' ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భారత దేశంలో అడుగుపెట్టిన కెమెరా ఎగిరే జాతీయ పతాకానికి సాక్ష్యంగా నిలిచిందని తెలిపారు. ఫొటోగ్రఫీ విలువ పలు విషయాలపై పరిశీలనాత్మకంగా దృష్టి సారిస్తేనే అర్థం అవుతుందని అన్నారు. 6వ బెటాలియన్ కమాండెట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్మెంట్‌లో అనేక కేసుల పరిష్కారానికి ఫొటోగ్రఫీ సాక్ష్యంగా ఉంటుందని తెలిపారు. అకాడమీ ద్వారా ఫొటాగ్రాఫర్లకు శిక్షణ ఇవ్వాలని అకాడమీ నిర్వాహకులకు సూచించారు. రేరా సభ్యులు రాజశేఖర్ మాట్లాడుతూ మాటలకందని భావాలని తెలియజేప్పడమే ఆర్ట్ ఫొటోగ్రఫీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ సెక్రటరీ కానాల సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అకాడమీ మాజీ అధ్యక్షులు బాబులు, పత్వా అధ్యక్షులు సంక శ్రీనివాస్, అకాడమీ వైస్ ప్రెసిడెంట్ సురేష్, జాయింట్ సెక్రటరీ వీరభద్ర రావు, సీనియర్ ఫొటో జర్నలిస్ట్ ఆనంద్ పాల్గొన్నారు.

లైంగిక దాడుల కేసులపై 'ఫాస్ట్ ట్రాక్' విచారణ

- హోంమంత్రికి ఐద్వా వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్య కేసులను త్వరగా విచారించేందుకు వీలుగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు ఉత్తర్వులివ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఐద్వా అధ్యక్షురాలు బి.ప్రభావతి, కార్యదర్శి డి.రమాదేవి, కోశాధికారి వి.సావిత్రి రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితకు లేఖ రాశారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో సంధ్యారాణిని దారుణంగా పట్టపగలే నడిరోడ్డుపై కత్తితో పొడిచి పీక కోసి అత్యంత భయానకంగా చంపడాన్ని ఐద్వా తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం వెంటనే స్పందించాలని, బాధితులకు భరోసానివ్వాలని ఐద్వా నేతలు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో వైఎస్ షర్మిల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన మహిళ లక్ష్మి చికిత్స పొందుతున్న ఆస్పత్రి వద్ద రోడ్డుపై బైటాయించిన వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ బిఎన్‌రెడ్డి నగర్‌లోని శ్యామ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న బాధితురాలు లక్ష్మిని ఆదివారం వైఎస్ షర్మిల పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైటాయించి, స్థానికులతో కలిసి ధర్నా చేపట్టారు. లక్ష్మిపై పోలీసుల దాడి అమానుషమని మండిపడ్డారు. "అర్ధరాత్రి మహిళ స్వేచ్ఛగా తిరిగినప్పుడే మనకు అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని గాంధీజీ అన్నారని, మహిళలపై దాడి ఘటనలు చోటు చేసుకుంటున్నాయంటే.. మనకు స్వాతంత్ర్యం వచ్చినట్టా? రానట్టా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి 120 గజాల స్థలం ఇస్తామనే విషయాన్ని బహిరంగంగా ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. బాధితురాలికి వెంటనే రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాతో ట్రాఫిక్ జామ్ కావడంతో వైఎస్ షర్మిలతో పాటు పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని హయత్‌నగర్ పిఎస్‌కు తరలించారు. అనంతరం లోటస్ పాండ్‌లోని ఆమె నివాసానికి తీసుకెళ్లారు.

షర్మిలను అదుపులోకి తీసుకుంటున్న మహిళా పోలీసులు

షాపును తగలబెట్టబోయి.. తానే కాలిపోయాడు..

ప్రజాశక్తి-దర్శి (ప్రకాశం జిల్లా)

టెంట్‌హౌస్‌ను దహనం చేయబోయి.. వ్యక్తి కాలిపోయిన ఘటన ప్రకాశం జిల్లా దర్శిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన పోతంశెట్టి వరప్రసాద్ (45) బంగారం షాపు నిర్వహిస్తున్నారు. ఆయనను దత్తత తీసుకున్న పెద్ద నరసింహులుకు చెందిన పట్టణంలోని షాపును శ్రీనివాసులు అనే వ్యక్తి అద్దెకు తీసుకొని టెంట్ హౌస్ నిర్వహిస్తున్నాడు. 2020లో పెద్ద నరసింహులు మృతి చెందడంతో అప్పటి నుంచి శ్రీనివాసులు షాపు అద్దె చెల్లించడం లేదు. దీంతో శ్రీనివాసులుకు, వరప్రసాద్‌కు కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం వరప్రసాద్ భార్య ఉమాదేవి, కుమార్తె హరిచందనతో కలిసి గుంటూరులో చదువుతున్న కుమారుడు వద్దకు వెళ్లేందుకు బయలుదేరారు. తనకు ఒంట్లో బాగోలేదని తరువాత వస్తానని వరప్రసాద్ భార్యకు చెప్పి ఇంట్లోనే ఉండిపోయారు. వారు వెళ్లిపోయిన తరువాత ఒక లీటరు పెట్రోల్ తీసుకుని టెంట్ హౌస్ వద్దకు వెళ్లి షట్టరు తీసి పెట్రోల్ పోసి.. షాపు తగలబెట్టారు. షాపులోకి వెళ్లిన తరువాత షెట్టరు రాకపోవడంతో మంటలలో కాలిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పొగలు రావడం గమనించిన స్థానికులు షట్టర్‌ను తీసేసరికే కాలిన గాయాలతో వరప్రసాద్ ఉన్నారు. వెంటనే 108లో ఒంగోలుకు తరలించగా.. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వేర్వేలు చోట్ల చిరుత పులుల సంచారం

- భయాందోళనలో రైతులు, ప్రజలు

ప్రజాశక్తి - రుద్రవరం (నంద్యాల జిల్లా)

నంద్యాల జిల్లా రుద్రవరం మండలం పెద్దకంబలూరు గ్రామ సమీపంలో రెండు చిరుత పులులు సంచరిస్తూ ఉండడంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోనూ చిరుత పులి సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. రుద్రవరం మండలం శ్రీరంగాపురం గ్రామ సమీపంలో గత మూడు రోజుల క్రితం చిరుత పులి సంచరించింది. మరికొన్ని చిరుత పులులు అటవీ సమీప గ్రామాలైన పెద్ద కంబలూరు సమీపంలోని పంట పొలాల్లో సంచరిస్తూ రైతులను గడగడలాడిస్తున్నాయి. అటవీ సమీపాన వందల ఎకరాల్లో మినుము, మొక్కజొన్న, వరి తదితర పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం తెలుగు గంగ కాలువ ద్వారా నీరు ప్రవహిస్తూ ఉండడంతో రైతులు పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పంట పొలాల్లో సంచరిస్తున్న చిరుత పులులను అడవుల్లోకి వెళ్లేలా ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రామకొండ, డోన్ మండలం ఇంద్రామపల్లి గ్రామాల మధ్య ఉన్న కొండల్లో చిరుత సంచరిస్తుందని, గొర్రెల కాపరులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు.

పాడేరులో పెను ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

నడుము ఎముకలు విరిగిపోగా, అదే మండలం చిప్పాపుట్లు గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మీకాంతం, నాతవరం మండలం డి.ఎర్రవరం గ్రామానికి చెందిన బుట్ట చిన్నమ్మలు, ఆర్‌టిసి బస్ డ్రైవర్ కె.సత్తిబాబులకు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. వారిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖకు పంపించారు. మిగిలిన క్షతగాత్రులకు పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాద విషయం తెలియగానే అక్కడికి పోలీసులు, రెవెన్యూ అధికారులు చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. ఈ ప్రమాద సమయంలో బస్సులో 38 మంది ఉన్నారు.

పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్

బాధితులకు మెరుగైన వైద్యం అందించండి : రాజన్నదొర

బస్సు ప్రమాద సంఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తొలుత ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్‌కు ఫోన్ చేసి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

క్షతగాత్రులకు మంత్రి అమర్‌నాథ్ పరామర్శ

ఘటనా స్థలాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరిశీలించారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబసభ్యులకు రూ.10 లక్షలు చొప్పున, శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి రూ.5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియాను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి జగన్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మంచి ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్టణం కలెక్టర్లను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తోడుగా నిలవాలని సూచించారు. ఘటనకు దారి తీసిన కారణాలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : చంద్రబాబు

పాడేరు ఘాట్ రోడ్‌లో ప్రమాదంపై టిడిపి అధినేత చంద్రబాబునాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు చనిపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాద ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం : పురందేశ్వరి

బస్సు ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్యం అందించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పంచాయతీల ఉప ఎన్నికల పోరులో 7 వార్డుల్లో సిపిఎం మద్దతుదారుల గెలుపు

ప్రజాశక్తి- యంత్రాంగం

గ్రామపంచాయతీలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఏకగ్రీవాలతో కలుపుకొని వార్డు సభ్యులుగా సిపిఎం మద్దతుదారులు ఏడుగురు గెలుపొందారు. వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఐదుగురు, కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు ఉన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి పంచాయతీ ఏడో వార్డులో బాడ్నయిన చిన్నయ్య, ఎటపాక మండలం త్రిపుర పెంటవీడు పంచాయతీ ఐదో వార్డులో గద్దల మణికుమారి, విఆర్.పురం మండలం జీడిగుప్ప పంచాయతీ ఏడో వార్డులో కటకాల వరలక్ష్మి, అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీ ఆరో వార్డులో పొట్టంగి సింహాద్రి, కర్నూలు జిల్లా ఆదోని మండలం పాండవగల్లు పంచాయతీ 2వ వార్డులో టి.వెంకటేష్, కల్లూరు మండలం ఉలిందకొండ పంచాయతీ 7వ వార్డులో జి.లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం గూడూరు పంచాయతీ ఐదో వార్డులో సోడే సూరయ్య 24 ఓట్ల మెజార్టీతో వైసిపి బలపరిచిన అభ్యర్థిపై గెలుపొందారు.

దీక్షల్లో కూర్చున్న రక్షణ రంగ ఉద్యోగులు

'ఉక్కు' పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు ఐక్య పోరాటాలు నిర్వహించనున్నామని ఎన్‌డివి ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి పి నాగేశ్వరరావు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 869వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో రక్షణ రంగానికి చెందిన ఎన్‌డివి ఎంప్లాయీస్ యూనియన్, షిప్‌యార్డ్ యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ పోరాటాల వల్లే ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణ అంశంలో కేంద్రం ముందుకు వెళ్లలేకపోతోందన్నారు. భవిష్యత్తులో ఈ పోరాటాలకు మరింత పదును పెట్టనున్నట్టు తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిచేలా చూడాలని కోరారు. ఉక్కు కార్మికుల పోరాటానికి దేశ ప్రజల మద్దతు ఉందన్న విషయాన్ని మోడీ ప్రభుత్వం గుర్తెరగాలన్నారు. దీక్షల్లో నాయకులు బి మోహనరావు, ఎస్ ప్రసాద్, బిఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

దళితులపై కొనసాగిన వివక్ష

- దళితపేటలోకి అమ్మవారి ఊరేగింపు రానీయకుండా అడ్డుకున్న పెత్తందార్లు
- ఆలయం బయటే పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్న ఎస్‌సిలు

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్ (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా పుత్తూరు మండలం రామకృష్ణాపురం దళితులపై గ్రామ పెత్తందార్ల వివక్ష కొనసాగుతోంది. పోలక్షమ్మ అమ్మవారి గుడిలోకి దళితులను రానీయకుండా గుడికి పెత్తందార్లు, పూజారి శనివారం తాళం వేశారు. దీనిపై దళితుల అభ్యంతరాన్ని వారు లెక్క చేయలేదు. పైగా ఆదివారం కూడా వివక్ష చూపారు. పోలక్షమ్మ అమ్మవారిని చుట్టుపక్కల ఏడు గ్రామాల్లో ఊరేగించిన అనంతరం రామకష్ణాపురం దళితవాడకు కూడా తీసుకురావడం అనవాయితీ. అయితే, ఈ ఏడాది కొత్తగా బాధ్యత స్వీకరించిన ఆలయ కమిటీ చైర్మన్, పెత్తందార్లు తమపట్ల వివక్ష చూపారని, అమ్మవారిని దళితవాడకు రానీయకుండా అడ్డుకున్నారని దళితులు వాపోయారు. దీంతో, ఆలయం వెలుపల రోడ్డుపై పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వివక్షపై తహశీల్దారు పరమేశ్వరస్వామికి ఫిర్యాదు చేశారు. మండల కేంద్రం పుత్తూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి పుత్తూరు ఎస్ఐ వెంకట మోహన్‌కు ఫిర్యాదు చేశారు.

ప్రజల గొంతు వినండి!

(మొదటి పేజీ తరువాయి)

వెనక్కి తగ్గిన పోలీసులు చివరిరోజైన ఆదివారం మరోసారి అడ్డుకున్నారు. దీంతో పలు సెషన్‌లను రద్దు చేసి డిక్లరేషన్‌పైనే ప్రతినిధులు దృష్టి సారించారు. దేశ వ్యాప్తంగా వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం నుండి హాజరైన 700 మంది ప్రతినిధులు డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు.

ప్రజల ప్రాధాన్యతలు గుర్తించండి

జి-20కి హాజరయ్యే నాయకులు ప్రజలు ఏమి చెబుతున్నారో, ఏమి కోరుకుంటున్నారో వినాలని డిక్లరేషన్ సూచించింది.

ప్రతి ఏడాది అట్టహాసంగా జరుగుతున్న ఈ సమావేశాలు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనాయని తెలిపింది ప్రజల ఆర్థిక, సామాజిక, పర్యావరణ, వ్యవసాయం, ఆహారం, జీవనోపాధి, అప్పులు, మానవహక్కుల ఉల్లంఘనలు, వాతావరణ మార్పులు, ప్రజాస్వామ్యానికి హాని చేస్తున్న విధానాల వంటి కీలక సమస్యలను పరిష్కరించడంలో జి-20 సమావేశాలు విఫలమవుతున్నాయని వివరించింది. ధనిక దేశాల మార్కెట్, ఆర్థిక వ్యవస్థల ఆర్థిక రాజకీయ ప్రయోజనాలే లక్ష్యం ఆ సమావేశాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయని, ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎడిబి), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) తదితర సంస్థలు ముందుకు తీసుకువచ్చే ఉదారవాద అజెండానే జి-20 ముందుకు తీసుకువస్తోందని డిక్లరేషన్ పేర్కొంది. ఈ సారి అసమానత, సంక్షోభాలకు దారి తీసే విధానాలపై చర్చించాలని డిమాండ్ చేసింది.పోలీసుల చర్యకు ఖండన

ప్రజలు శాంతియుతంగా సమావేశమై తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించే ప్రజాస్వామ్య హక్కును అడ్డుకున్న పోలీసుల చర్యను వియ్-20 డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ తరహా విధానాలు మానుకోవాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని కోరింది.

సమస్యల వలయంలో దేశం

దేశం అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున సమయంలో జి-20 శిఖరాగ్ర సమావేశం జరుగుతోందని డిక్లరేషన్ పేర్కొంది. దేశ వ్యాప్తంగా అసమానతలు పెరుగుతున్నాయని, కార్మికులు, రైతులు, మత్స్యకారులు, దళితులు, ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నారని తెలిపింది. ఆకాశాన్నంటుతున్న ఆహారం, ఇంధన ధరలు, విపరీతమైన వాతావరణ పరిస్థితులు, వాతావరణ పర్యావరణ విధ్వంసం సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయని తెలిపింది. మత ఘర్షణలు, అభ్యుదయ శక్తులు, మహిళలు, ట్రాన్స్ జెండర్‌లపై దాడులు పెరుగుతున్నాయని పేర్కొంది. ప్రజాస్వామ్య వాతావరణానికి ముప్పు ఏర్పడుతున సమయంలో జి-20 శిఖరాగ్ర సదస్సు జరుగుతోందని వివరించింది.

పునరావాసం ... పరిహారం

ఢిల్లీతో పాటు, దేశంలోని అనేక నగరాల్లో జరగనున్న జి-20 మెగా ఈవెంట్ల కోసం వేలాదిమంది పట్టణ పేదలను, అట్టడుగు వర్గాల వారిని నిరాశ్రయులను చేశారని, వారి ఇళ్లను కూల్చివేశారని సదస్సు ఆవేదన వ్యక్త ంచేసింది. ఈ దాడులను తీవ్రంగా ఖండించిన సదస్సు జి20 ఈవెంట్‌ల ఏర్పాటు కోసం జీవనోపాధిని కోల్పోయిన వారికి పునరావాసంతో పాటు తగిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది.

ప్రజాధనంతో ప్రకటనలా...?

జి-20 సమావేశాలకు భారతదేశం అధ్యక్షత వహిస్తున్న విషయాన్ని ప్రచారం చేయడం కోసం ప్రజాధనాన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడాన్ని డిక్లరేషన్ విమర్శించింది. ఆహారం, ఇంధన ధరలు విపరీతంగా పెరిగిపోతున్న సమయంలో ఈ తరహా ఖర్చు సమంజసం కాదని పేర్కొంది. 'భారతదేశాన్ని ప్రజాస్వామ్యానికి తల్లి అని ఘనంగా చెప్పుకుంటున్నాం. జి-20 సదస్సు కోసం పేదలను తరిమివేయడం, శ్రామిక వర్గ నివాసాలను తెరల వెనుక దాచడం, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజా ధనాన్ని ఖర్చు చేయడం వంటి చర్యలు ఈ భావనను దెబ్బతీస్తాయి. జి-20 అధ్యక్ష పదవి ప్రతి ఏడాది ఒక్కో దేశానికి మారుతోంది. అలా యాధృచ్ఛికంగా ఈ ఏడాది మన దేశానికి వచ్చింది. వచ్చే ఏడాది మరో దేశానికి వెళ్లిపోతోంది. ఈ విషయాన్ని గుర్తించాలి' అని పేర్కొంది.

'వియ్' -20 సదస్సును అడ్డుకోవడం దుర్మార్గం

- సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజాసంఘాలు మేధావులతో కలిసి ఢిల్లీలో నిర్వహిస్తున్న 'వియ్' - 20 సదస్సును బిజెపి ప్రభుత్వం నిరంకుశత్వంగా అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేపట్టారు. నెల్లూరు బాలాజీ నగర్‌లోని సిపిఎం కార్యాలయం నుంచి మినీ బైపాస్ వద్దనున్న జ్యోతిరావు పూలే విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ సెప్టెంబర్‌లో నిర్వహించతలపెట్టిన జి-20 దేశాల సమ్మిట్ నేపథ్యంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలోని సూర్జిత్ భవన్‌లో ప్రముఖ ఆర్థిక వేత్తలు, మేధావులు పాత్రికేయులు, రాజకీయవేత్తలు కలిసి మూడు రోజులు పాటు 'వియ్' -20 సదస్సును నిర్వహించనున్నారని తెలిపారు. ఆ సెమినార్‌ను అడ్డుకునేందుకు సూర్జిత్ భవన్‌కు తాళాలు వేసి పోలీసు బలగాలు మోహరించడం బిజెపి ప్రభుత్వం దుర్మార్గలకి నిదర్శనమన్నారు. దేశంలో పౌర హక్కులను, ప్రజాస్వామిక విలువలను బిజెపి కాలరాస్తుందని దుయ్యబట్టారు. ఇటువంటి నిరంకుశ వైఖరిని ప్రజలందరూ ఖండించాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగేశ్వరరావు, పి సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు బిపి నరసింహ, కత్తి పద్మ,మూలం ప్రసాద్, ఆర్ నగేష్ తదితరులు ఉన్నారు.

సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో పూలే బొమ్మ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో

మోడి ప్రభుత్వం హరి కిషన్ సింగ్ సూ ర్జిత్ భవన్ కు తాళాలు వేయటం పిరికిపంద చర్య అని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ఢిల్లీలోని హరి కిషన్ సింగ్ సూర్జిత్ భవనానికి కేంద్ర ప్రభుత్వం తాళాలు వేయడాన్ని ఖండిస్తూ సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప గుడి సెంటర్లో నిరసన ప్రదర్శన చేపట్టారు. సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య మాట్లాడారు. సిపిఎం రూరల్ కార్యదర్శివర్గ సభ్యులు కిన్నెర కుమార్, కొండా ప్రసాద్, రూరల్ కమిటీ సభ్యులు దేవతాటి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

'సిబిఆర్' పనులకు గ్రహణం

- లక్ష ఎకరాల స్థిరీకరణకు బ్రేక్
- నిధుల కొరతే కారణం

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూగర్భ టన్నెల్ పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. కొండ తవ్వకం ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే పనులు నిలిచిపోయాయి. దీంతో, లక్ష ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు బ్రేక్ పడింది. పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. అదనపు ఎత్తిపోతల పనులకు ప్రభుత్వం 2020 మార్చిలో రూ.2,550 కోట్లతో టెండర్లు పిలిచింది. మేఘా ఇంజనీరింగ్ సంస్థ ఈ కాంట్రాక్టు దక్కించుకుంది. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలంలోని గండికోట రిజర్వాయర్ నుంచి చిత్రావతి రిజర్వాయర్ వరకు 33 కిలోమీటర్ల మేర రెండు దశల్లో టన్నెల్ పనులు చేపట్టాల్సి ఉంది. 212 కాంటూరులోని గండికోట రిజర్వాయర్ నుంచి 280 కాంటూరులోని పైడిపాలెం రిజర్వాయర్ మీదుగా టన్నెల్ నిర్మించాలి. అనంతరం పైడిపాలెం రిజర్వాయర్ నుంచి 300 కాంటూరు పరిధిలోని సిబిఆర్ రిజర్వాయర్‌కు ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించేలా డిజైన్ చేశారు. మొదటి దశ కింద ఆరు కిలోమీటర్ల మేర గండికోట నుంచి పైడిపాలెం రిజర్వాయర్ వరకు, రెండో దశ కింద పైడిపాలెం నుంచి చిత్రావతి రిజర్వాయర్ వరకు 27 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు చేపట్టాలి. కొండాపురం నుంచి సింహాద్రిపురం, తొండూరు మండలాల మీదుగా భూగర్భ టన్నెల్ ద్వారా లింగాల మండల పరిధిలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తారు. రోజుకు 3000 టిఎంసిల చొప్పున వరద సీజన్‌లో 40 రోజుల వ్యవధిలో 12 టిఎంసిలను ఎత్తిపోయాల్సి ఉంటుంది. పాత పైప్‌లైన్ ద్వారా మరో 12 టిఎంసిలను కలిపితే 24 టిఎంసిల నీటిని పైడిపాలెం, చిత్రావతి రిజర్వాయర్లకు తరలించాలనేది ప్రణాళిక. పైడిపాలెం కింద 47,500 ఎకరాలు, చిత్రావతి కింద 59,400 ఎకరాలు, పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలో 20 వేల ఎకరాలు మొత్తంగా 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ పనులు చేపట్టాలి. పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం, తొండూరు, లింగాల మండలాలు, శ్రీసత్యసాయి జిల్లాలోని యల్లనూరు మండలాల పరిధిలో దీని ఆయకట్టు ఉంది. సాధారణ అదనపు పైప్‌లైన్ పనుల చేపట్టడం వల్ల 550 ఎకరాలను సేకరించాల్సి వచ్చేది. రూ.60 కోట్ల భూసేకరణకు పరిహారం చెల్లించాల్సి వచ్చేది. ప్రెజర్ భూగర్భ టన్నెల్ పనుల కారణంగా ఒక్క ఎకరం కూడా భూసేకరణ, పరిహారం సమస్యలు తలెత్తకుండా ఎత్తిపోతల పనులకు డిజైన్ చేశారు. మూడేళ్ల క్రితం మేఘా ఇంజనీరింగ్ కాంట్రాక్టు సంస్థ కొండాపురం మండలంలోని గండికోట రిజర్వాయర్‌కు సమీపంలోని పెద్దకొండ లోపలి భాగంలో 20 మీటర్ల విస్తీర్ణం కలిగిన 33 కిలోమీటర్ల పొడవునా టన్నెల్ తవ్వకపు పనులు చేపట్టింది. ఇందుకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో భూగర్భ టన్నెల్ పనులు నిలిపేసింది. దీనిపై ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌ను సంప్రదించగా ఇది వాస్తవమేనని ధ్రువీకరించారు.

మైనర్ ప్రేమికులు ఆత్మహత్య

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా పీలేరు రహదారిలోని భాకరాపేట ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ మైనర్ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చిట్టెంవారి పల్లికి చెందిన కళ్యాణి (15), చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం జోగిఇండ్లు (కొత్తిండ్లు)కు చెందిన యుగంధర్ (17) పుంగనూరు ఎంసివి జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవ త్సరం చదువుతున్నారు. వీరిద్దరూ గతకొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడం, ఇద్దరు మైనర్లు కావడంతో తమ ప్రేమను కుటుంబ సభ్యులు అంగీకరించరనే ఉద్దేశంతో ఈ నెల 18న ఇంట్లో నుంచి పారిపోయారు. అదే రోజు పెళ్లి చేసుకుని ఆదివారం చిన్నగొట్టికల్లు మండలం భాకరాపేట సమీపంలోని అడవిలోకి వచ్చి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు గుర్తించి పోలీసు లకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరించారు. భాకరాపేట ఇన్‌చార్జి సిఐ రాజశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ ప్రాంతంలో ఉరి వేసుకుని మరణించిన ప్రేమికులు

వంద రోజుల్లో మోటారు రంగ సమస్యల పరిష్కారం

- ట్రాన్స్‌పోర్టు రంగ ప్రతినిధులతో భేటీ సందర్భంగా లోకేష్ హామీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

టిడిపి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పన్నులు తగ్గించి ఇతర రాష్ట్రాలతో మన ట్రాన్స్‌పోర్టు రంగం పోటీ పడే విధంగా చేస్తామని, అన్ని రాష్ట్రాల కంటే కనీసం రూపాయి తక్కువ పన్నులు ఉండే విధంగా చేస్తామని టిటిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆదివారం ఉదయం విజయవాడ బృందావన్ కాలనీ విడిది కేంద్రం వద్ద ఆటోనగర్, రవాణా రంగం ప్రతినిధులు, కార్మికులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మోటారు రంగ ప్రముఖులు పలు సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్‌కు ఎంతో చరిత్ర ఉందని, తాను అంబాసిడర్ కొన్నప్పుడు ఆటోనగర్‌లోనే అప్‌గ్రేడ్ చేయించామన్నారు. అంబాసిడర్ కారుని ఆటోమేటిక్ కారుగా మార్చిన నైపుణ్యం ఆటోనగర్ కార్మికులదని వివరించారు. ఆటోనగర్‌ను ప్రయివేటుపరం చేసి భూములు కొట్టేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా జిఒ తీసుకొచ్చారని విమర్శించారు. గ్రీన్ ట్యాక్స్, ఇతర పన్నులు విపరీతంగా పెంచి ట్రాన్స్‌పోర్టు రంగాన్ని దెబ్బతీశారన్నారు. జగన్ పాలనలో రహదారుల పరిస్థితి దారుణంగా ఉందని, రోడ్లకు గుంతలు పూడ్చే స్థితిలో ప్రభుత్వం లేదని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు వేయిస్తామని తెలిపారు. ఆటోనగర్ ప్రయివేటీకరణకు సంబంధించి తీసుకువచ్చిన జిఒను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు.

విజయవాడలో ముఖాముఖిలో మాట్లాడుతున్న లోకేష్

అంతకుముందు ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నాయకులు మలినేని నారాయణ ప్రసాద్, ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, రవాణా రంగ ప్రముఖులు చెన్నుపాటి వజీర్ పలువురు ప్రముఖులు ఆటోనగర్, రవాణా రంగ సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రం అందజేశారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ప్రారంభమైన పాదయాత్ర కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గానికి చేరుకుంది.

పాదయాత్రకు స్పందన కరువు : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి నేత నారా లోకేష్ నిర్వహిస్తున్న పాదయాత్రకు స్పందన కరువైందని పలువురు వైసిపి నేతలు అన్నారు. ఆదివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసిపి ఇంచార్జీ దేవినేని అవినాష్ మీడియాతో మాట్లాడారు. సొంత పార్టీకి చెందిన స్థానిక పార్లమెంటు సభ్యుడే లోకేష్ పాదయాత్రను బహిష్కరించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చని వారన్నారు. అమరావతిలో ఇళ్ల స్థలాలను పేదలకు ఇస్తుంటే అడ్డుకున్నారని విమర్శించారు. గుంటూరు, కష్ణా జిల్లాల పేదలకు లోకేష్ క్షమాపణలు చెప్పి పాదయాత్రను కొనసాగించాలని డిమాండ్ చేశారు. తన సొంత కుమారుడితో చేపట్టిన పాదయాత్రతో మైలేజి రావడంలేదని 'దత్తపుత్రుని'తో మరో కార్యక్రమాన్ని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు చేపట్టారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నంటే వున్నారని, ఎవరు ఎన్ని చేసినా 2024 ఎన్నికల్లో ప్రజలు మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్‌కు అండగా నిలవనున్నారని తెలిపారు.

విద్యుత్ కోతలు లేవు : డిస్కమ్‌లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా డిమాండుకు సరిపడా విద్యుత్ సరఫరా ఉందని, డిమాండు-సరఫరా మధ్య తేడా లేనందున ఎక్కడా విద్యుత్ కోతలు లేవని డిస్కమ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20న ప్రజాశక్తిలో 'చీకట్లో పల్లెలు' పేరుతో ప్రచురితమైన కథనానికి డిస్కమ్‌లు వివరణ విడుదల చేశాయి. కర్నూలు జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సరఫరాపై నియంత్రణలు లేవని పేర్కొన్నాయి. విద్యుత్ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని, విద్యుత్ కోతలు ఇప్పుడు ఎక్కడా లేవని తెలిపాయి. డిమాండుకు తగినట్లుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సగటున రోజుకు 235 నుంచి 240 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని, రోజుకు 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు విద్యుత్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపాయి.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : అగ్నిపథ్ కింద చేపట్టిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని పల్నాడు జిల్లా నరసరావుపేటలోని జిల్లా క్రీడా ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఎల్ శివశంకర్ ఆదివారం ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి అభ్యర్థులు శనివారం రాత్రే స్టేడియం వద్దకు చేరుకున్నారు. వీరికి పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల బాలుర హాస్టల్లో వసతి కల్పించారు. ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ర్యాలీలో అభ్యర్థులు అర్హతల సాధించాలని ఆకాంక్షించారు. మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉన్నవారే రాణిస్తారని, వాటిని అందరూ అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెసి శ్యామ్ ప్రసాద్, కల్నల్ పునీత్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంచారంపై వదంతులొద్దు : టిటిడి

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల కాలిబాటలో చిరుత, ఎలుగు బంటిల సంచారంపై ఎప్పటికప్పుడు కెమెరాలతో పర్యవేక్షిస్తున్నామని, వదంతులు సృష్టించొద్దని టిటిడి అటవీశాఖ అధికారి శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాలిబాటలో వచ్చే సందర్శకులకు జిల్లా అటవీ శాఖ అధికారులు పలు జాగ్రత్తలు, సూచనలు చేస్తున్నారని, వన్య ప్రాణుల సంచారం ఎక్కువగా ఉన్న చోట రెస్క్యూ బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. శేషాచలం అడవులు చిరుతలకు, ఎలుగుబంటులకు ఆవాసంగా ఉన్నాయని, రాత్రి పూట కాలిబాటలో సందర్శకులను గుంపులుగా పంపిస్తున్నామని పేర్కొన్నారు. వన్య ప్రాణుల సంచారం, కాలిబాట గురించి అపోహలు, వదంతులు సష్టించొద్దని తెలిపారు.

రైతన్నల ఆత్మహత్యలపై చంద్రబాబు ఆవేదన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకోవడంపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో పర్యటనకు వెళ్లినా అన్నదాతల కష్టాలు, వ్యవసాయ రంగ సమస్యలు కనిపిస్తున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం ఇప్పటికైనా పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. సాగుకు సబ్సిడీలు, పంటలకు గిట్టుబాటు ధరలు ఇచ్చి రైతులకు, కౌలు రైతులకు అండగా నిలవాలని కోరారు.

టెండర్లన్నీ వైసిపి నేతల కంపెనీలకే : ఆనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పరిపాలన అంతా కేవలం 12 మంది వ్యక్తుల చేతుల్లో నడుస్తోందని, టెండర్లు ఎవ్వరికి ఇవ్వాలి? ఎవ్వరిని అరెస్టు చేయాలి? ఇలాంటివన్నీ వారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయని టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీని పెట్టి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రకరకాల వర్క్‌లు తీసుకుంటుందని, ఆ సంస్థ అధిపతి మేడా చంద్రశేఖర్ రెడ్డి కుటుంబానికి తప్పితే మరోకరికి పనులు దక్కవని ఆరోపించారు. రాష్ట్రంలో ట్రాన్స్‌ఫార్మర్లు, సోలార్ పవర్, మోటార్లకు బిగించే మీటర్లు టెండర్లు విఘ్నేశ్వర్ రెడ్డికి చెందిన షిర్డీసాయి కంపెనీకే తప్ప మరోకరకు వెళ్లదని విమర్శించారు. పొగులేటి శ్రీనివాసరెడ్డి రాఘవా కన్‌స్ట్రక్షన్స్ పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, ఇరిగేషన్, రోడ్లు, హంద్రీనివా ప్యాకేజి, తంబళ్లపల్లి రిజర్వాయర్, ఎత్తిపోతల పథకం పనులన్నీ ఆయన కంపెనీవేనని ఆనం ఆరోపించారు.

ట్రాన్స్‌జెండర్లకు హక్కులు కల్పించాలి

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ట్రాన్స్‌జెండర్లను స్త్రీ, పురుషులతో సమానంగా మూడో మనిషిగా గుర్తించి హక్కులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆదివారం లేఖ రాశారు. సాధారణ ప్రజల విషయంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న సంక్షేమ పథకాలు ట్రాన్స్‌జెండర్లకు అందడం లేదన్నారు. ట్రాన్స్‌జెండర్లను సమాజంలో మూడో మనిషిగా గుర్తించాల్సిన అవసరాన్ని 'నల్సా తీర్పు'లో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని ఆయన గుర్తు చేశారు. స్త్రీ, పురుషులతో సమానంగా హక్కులు కల్పించాలనేది నల్సా తీర్పు సారాంశమని, క్షేత్రస్థాయిలో ఆ తీర్పు ఎక్కడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. హిజ్రాల కోసం అత్యవసర మద్దతు అందించేలా 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరారు.

మణిపూర్‌లో గుజరాత్ నమూనా

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గుజరాత్‌లో జరిగిన మతోన్మాద దాడుల నమూనానే ప్రస్తుతం పకడ్బంధీగా మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. ఆదివారం విజయవాడలోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుకీలు నివసిస్తున్న అటవీ ప్రాంతంలో ఉన్న విలువైన ఖనిజ వనరులను కార్పొరేట్లుకు దోచిపెట్టేందుకే మణిపూర్‌లో దాడుల జరుగుతున్నాయన్నారు. మణిపూర్‌లో మెయితీ తెగలకు రిజర్వేషన్లు కల్పించే చర్యల వెనుక పెద్ద కుట్ర కోణం ఉన్నదని పేర్కొన్నారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, గిరిజనుల హక్కులు కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. రాష్ట్రంలో కూడా డబల్ ఇంజిన్ పాలన నడుస్తుందన్నారు. పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి బిల్లుకి వైసిపి మద్దతు తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు ఆర్ వెంకయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరరావు, డి శంకర్ పాల్గొన్నారు.

'మార్గదర్శి'లో కొత్త తరహా అక్రమాలు

- మూడు రోజులుగా తనిఖీలు
- ఫిర్యాదుల కోసం ఫోన్ 9493174065
- సిఐడి చీఫ్ ఎన్ సంజయ్ వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్గదర్శి చిట్ ఫండ్స్ లావాదేవీల్లో కొత్త తరహా అక్రమాలు వెలుగులోకి వచ్చాయని రాష్ట్ర సిబిడి చీఫ్ ఎన్ సంజయ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని 'మార్గదర్శి' కార్యాలయాల్లో మూడు రోజులుగా తనిఖీలు కొనసాగిస్తున్న నేపథ్యంలో మంగళగిరిలోని సిఐడి ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజి రామకృష్ణతో కలిసి సంజయ్ మీడియాతో మాట్లాడారు. 'మార్గదర్శి'లో వేలం పాటల్లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని, చిట్ ప్రారంభంలోనే ఖాతాదారుల సంతకాలు సేకరించి వారి బదులు ఏజెంట్లు, మేనేజర్లే వేలం పాటలో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ష్యూరిటీ సంతకాలు పెట్టిన వారి ఆస్తులు అక్రమంగా లాక్కుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి అక్రమాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని, బాధితులెవరైనా ఫోన్ నెంబరు 9493174065కు కాల్ చేసి, లేదా మేసేజ్ రూపంలోనైనా తమకు ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.

మూడు కేసుల్లో ముగ్గురు మేనేజర్లు అరెస్టు

'మార్గదర్శి' అక్రమాలపై డిపాజిట్ దారులే తమకు ఫిర్యాదు చేశారని, అందులో భాగంగానే తనిఖీలు చేపట్టినట్లు సంజయ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మూడు ఎఫ్ఐఆర్‌లకు సంబంధించిన వివరాలను ఆయన వివరించారు. చీరాలలో సుబ్రమణ్యం అనే ఖాతాదారుడి ఆధార్ ఆధారంగా ఆయనకు తెలియకుండానే వేలం పాట పాడారన్నారు. అనకాపల్లిలో ఫిర్యాదు దారుడు వెంకటేశ్వరరావుకు రూ.4.6 లక్షలు రావాల్సి వుండగా కేవలం రూ.20 ఇచ్చారని తెలిపారు. రాజమండ్రిలో కోరుకొండ విజయకుమార్ కూడా ఫిర్యాదు చేశారన్నారు. ఈ మూడు కేసులలో బ్రాంచ్ మేనేజర్లని అరెస్ట్ చేశామన్నారు.

కొంతమంది మేనేజర్లు రికార్డులు చూపించమంటే పారిపోతున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన శారదా చిట్స్ తరహాలోనే మార్గదర్శి కుంభకోణం వుందని ఈ సందర్భంగా సిఐడి ఎస్‌పి అమిత్ బర్దార్ అన్నారు. డిపాజిట్ దారులు కానివారి డాక్యుమెంట్స్‌తో అక్రమాలకి పాల్పడ్డారని తెలిపారు. మార్గదర్శి చిట్‌ఫండ్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తోందని అన్నారు. ఇలాంటి కంపెనీల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని కోరారు.

కావాలనే దుష్ప్రచారం

- యశ్వంత్ మృతి విషయంలో ఎన్ఆర్ఐ యాజమాన్యం

ప్రజాశక్తి - అమరావతి

రూల్‌బుక్‌కు అనుగుణంగా తాము పని చేస్తున్నందున సహించలేకే కొందరు తమ పైనా, ప్రిన్సిపాల్ పైనా దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ఎన్ఆర్ఐ యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో మెడికల్ కళాశాల విద్యార్థి యశ్వంత్ వెంకట ప్రణవ్ కామేపల్లి అకాల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్త ం చేసింది. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపింది. ఫీజు విషయంలో ఒత్తిడి చేయడం వల్లే యశ్వంత్ ఆత్యహత్య చేసుకున్నాడంటూ జరుగుతున్న ప్రచారాన్ని యాజమాన్యం ఖండించింది.గత యాజమాన్య హయంలో అనైతిక, అనారోగ్యమరమైన పద్ధతులను అవలంభించారని, ఒప్పందాలను ఎక్కడా లిఖితపూర్వకంగా నమోదు చేయలేదని తెలిపింది. యశ్వంత్ విషయంలోనూ ఇదే జరిగిందని తెలిపింది. విద్యార్థి అడ్మిషన్ సమయంలో ఒప్పుకున్న దానికి భిన్నంగా ఫీజు చెల్లిస్తుండటంతో 12 లక్షల రూపాయల బకాయిలు పేరకుపోయాయని, ఆ మేరకు నోటీసు ఇచ్చామని తెలిపింది. సాధారణ ప్రక్రియలో భాగంగానే ఈ నోటీసు జారీ ప్రకియ జరిగిందని పేర్కొంది. ఆ వెంటనే గత యాజమాన్యంతో చేసుకున్న మౌఖిక ఒప్పందాన్ని విద్యార్థి తల్లితండ్రులు వివరించారని, దీంతో సమస్య సామరస్య పూర్వకంగా జూన్ నెలలో పరిష్కారమైందని పేర్కొంది. ఆ తరువాత విద్యార్థి తరగతులకు హాజరయ్యాడని తెలిపింది. యశ్వంత్ ఆత్మహత్యకు కారణాలు ఏమైనా అది భాధాకరమని పేర్కొన్న యాజమాన్యం వాస్తవాలు బయటకు రావాలంటే సమగ్రమైన, వృత్తిపరమైన దర్యాప్తు అవసరమని తెలిపింది. దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరింది. కుటుంబ సభ్యులకు భరించలేని దుస్థితిని కలిగించేలా యశ్వంత్ విషాదకరమైన మరణం చుట్టూ తప్పుడు కథనాలను అల్లారని, వాటిని ఖండిస్తున్నట్లు తెలిపింది. 'వ్యక్తులు రావచ్చు. పోవచ్చు. కానీ సంస్థలు శాశ్వతమైనవి. అటువంటి సంస్థలు ప్రజల మంచి కోసం అభివృద్ధి చెందాలని తాము భావిస్తామని తెలిపిన ఎన్ఆర్ఐ యాజమాన్యం ఈ ప్రాంతంలోని అణగారిన ప్రజలకు మంచి వైద్యం, విద్యార్థులకు వైద్య విద్య. వందల మదికి జోవనోపాధి కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొంది.

KLM AXIVA FINVEST LTD
4వ అంతస్తు, డోర్ నం.1871ఎ24, విఎం ప్లాజా, సివిల్ లైన్ రోడ్, పలారివాతం, కొచ్చిన్-682025, ఫోన్: 7558865300.

వేలం ప్రకటన

కెఎల్ఎం ఆక్షీవ ఫిన్వెస్ట్ లిమిటెడ్ అనునది, దిగువ పేర్కొన్న బ్రాంచీలలో తాకట్టుపెట్టిన ఐటెంలను ఒక క్రమ పద్ధతిలో 22.08.2023న బిడ్‌చేయుటకు నిర్ణయించింది, కావున, తిరిగి చెల్లించుటలో లేదా వడ్డీతో రినెవల్‌చేసుకొనుటలో ఆసక్తిగల వినియోగదారులు వేలం కాలవ్యవధికి ముందు వారి సదరు బ్రాంచీలను సంప్రదించవచ్చును. అయితే, విఫలం చెందిన ఏదైతే, పై కారణాలతో వేలంవేయబడుతుంది, ఆపరేటర్స్ ఏదేని తదుపరి నోటీసు ఇవ్వకుండానే వేలం నిర్వహించుట కొరకు, మరియు వేలం ప్రక్రియ వాయిదావేయుటకు పూర్తి అధికారాలు కలిగియుంటారు. కెఎల్ఎం ఆక్షీవ ఫిన్వెస్ట్ లిమిటెడ్. విఎం ప్లాజా, సివిల్ లేన్ రోడ్, పాలరివాతం.

2వ వేలం తేది& సమయం: 25.08.2023, మ॥ 02.00గం.లు, **వేలం కేంద్రం:** డోర్ నం.: 14-2-1,2,3, బాంబే హెూసియరీస్ & ఫ్యాషన్ బిల్డింగ్ యొక్క మొదటి అంతస్తు, స్టేడియం దగ్గర, జిటి రోడ్డు, పోతూరివారి తోట, గుంటూరు-522001 (గుంటూరు జిల్లా) గుంటూరు లాలాపేట్ 202204110100076 మాచవరం202304160100003 202304160100032 మంగళగిరి202204290100051 202304290100061 202304290100076 రేపల్లె 202205050100014 2 0 2 2 0 5 0 5 0 1 0 0 0 2 3 2 0 2 2 0 5 0 5 0 1 0 0 0 2 9 2 0 2 2 0 5 0 5 0 1 0 0 0 3 5 2 0 2 2 0 5 0 5 0 1 0 0 0 3 7 2 0 2 2 0 5 0 5 0 1 0 0 0 4 2 2 0 2 3 0 5 0 5 0 1 0 0 0 2 0 202305050100079.

KLM AXIVA FINVEST LTD
4వ అంతస్తు, డోర్ నం.1871ఎ24, విఎం ప్లాజా, సివిల్ లైన్ రోడ్, పలారివాతం, కొచ్చిన్-682025, ఫోన్: 7558865300.

వేలం ప్రకటన

కెఎల్ఎం ఆక్షీవ ఫిన్వెస్ట్ లిమిటెడ్ అనునది, దిగువ పేర్కొన్న బ్రాంచీలలో తాకట్టుపెట్టిన ఐటెంలను ఒక క్రమ పద్ధతిలో 22.08.2023న బిడ్‌చేయుటకు నిర్ణయించింది, కావున, తిరిగి చెల్లించుటలో లేదా వడ్డీతో రినెవల్‌చేసుకొనుటలో ఆసక్తిగల వినియోగదారులు వేలం కాలవ్యవధికి ముందు వారి సదరు బ్రాంచీలను సంప్రదించవచ్చును. అయితే, విఫలం చెందిన ఏదైతే, పై కారణాలతో వేలంవేయబడుతుంది, ఆపరేటర్స్ ఏదేని తదుపరి నోటీసు ఇవ్వకుండానే వేలం నిర్వహించుట కొరకు, మరియు వేలం ప్రక్రియ వాయిదావేయుటకు పూర్తి అధికారాలు కలిగియుంటారు. కెఎల్ఎం ఆక్షీవ ఫిన్వెస్ట్ లిమిటెడ్. విఎం ప్లాజా, సివిల్ లేన్ రోడ్, పాలరివాతం.

2వ వేలం తేది& సమయం: 25.08.2023, ఉ॥ 10.00గం.లు, **వేలం కేంద్రం:** మొదటి అంతస్తు, శ్రీ కృష్ణ నిలయం, బ్యాంక్ ఆఫ్ బరోడా పైన, గవర్నర్‌పేట్, ఏలూరు రోడ్, కృష్ణ-520002 (కృష్ణా జిల్లా) భవానిపురం గవర్నర్‌పేట్202203980100038 202203980100074 202303980100004 గవర్నర్‌పేట్202304020100017 202304020100018 202304020100032 కంకిపాడు 202204100100158 2 0 2 2 0 4 1 0 0 1 0 0 1 9 0 2 0 2 2 0 4 1 0 0 1 0 0 2 0 3 2 0 2 2 0 4 1 0 0 1 0 0 2 1 0 మచిలీపట్నం 202204200100063 202204200100105 2 0 2 2 0 4 2 0 0 1 0 0 1 1 8 2 0 2 2 0 4 2 0 0 1 0 0 1 4 0 2 0 2 3 0 4 2 0 0 1 0 0 0 0 5 2 0 2 3 0 4 2 0 0 1 0 0 0 2 9 2 0 2 3 0 4 2 0 0 1 0 0 0 4 3 2 0 2 3 0 4 2 0 0 1 0 0 0 4 4 202304200100049 202304200100075 202304200100120 పోరంకి 2 0 2 2 0 3 9 9 0 1 0 0 1 5 7 2 0 2 2 0 3 9 9 0 1 0 0 1 6 0 2 0 2 2 0 3 9 9 0 1 0 0 1 6 2 202303990100030 202303990100041 రాజుపేట202304880100062 202304880100063 వయ్యూరు202203850100162 202303850100065 202303850100086.

ANGEL ONE LIMITED
Regd. Off: 601, 6th Floor, Ackruti Star, Central Road, MIDC, Andheri East, Mumbai - 400093
SEBI Registration No (Stock Broker): INZ000161534

PUBLIC NOTICE

Name of SB/AP	Trade Name of SB/AP	NSE Reg. No.	BSE Reg. No.	MCX Reg. no.	NCDEX Reg. no.	REGD ADDRESS OF SB/AP
MANUKONDA SRIHARI RAO	MANUKONDA SRIHARI RAO	AP0397 360011	#N/A	#N/A	#N/A	2-86ABBURU ABBURU NARA SARAOPET 522403
SUDHEER KUMAR ARAMANDLA	SUDHEER KUMAR ARAMANDLA	AP039 751921	AP01061 20131370	MCX/ AP/3510	56003	3-66PENUMULINEAR WATER TANK GUNTUR 522330

This is to inform/confirm that we have discontinued our Business Relations with the above mentioned Authorized Persons. Clients and General Public are warned against Dealing in with them in his/their capacity as our Authorized Persons and we hereby confirm that we will not be liable in any manner for any consequence of such dealings/deals.
Clients are requested to contact our centralized desk 022-3355 1111/4218/5454 or email us to support@angelbroking.com.

Date : 21.08.2023
Place : Andhra Pradesh

For ANGEL ONE LTD
Sd/-
Authorised Signatory

"నిరక్షరాస్యుడు అంటే చదవడం, రాయడం రానివాడు కాదు. గుణపాఠాలను నేర్చుకోవడానికి, తప్పులను సరిదిద్దుకోవడానికి సరైన మార్గంలో పయనించడానికి సిద్ధపడని వాడు."
- ఆల్విన్ టోఫ్లర్, అమెరికన్ రచయిత

'దర్శి'ని

ప్రేమ రెండు అక్షరాలు
రెండు మనసులు
ఇద్దరు మనుషులు
అదొక కులం ఇదొక కులం
కలిసారు
కథ ఒడిసి పోలే!

కులం బుసలు కొట్టింది
పితృస్వామ్యం జడలు విప్పింది
అన్న ప్రేమ
చెల్లెలి వివస్త్ర దాకా
మధ్యలో కత్తిపోట్లు!
కట్టివేత తాళ్ళతో!

వివస్త్రను గావిస్తున్నా
పెగలని గొంతులు
బిగుసుకోని పిడికిళ్లు
కారణం ఆమె
నిచ్చెన మెట్లలో చివరి మెట్టు!

కేసు వుండదు
ఆమెకి పరువు వుండదు
ఆమెకి ఆత్మాభిమానం వుండకూడదు
ఆమె ఓ పరీక్షా నాళికలో భాస్వరం
లోలోనే మండాలి!
బైట పడితే రాజ్యం ఆమెది కాదు,
వెల కట్టే రాజ్యం సిద్ధం!

పశ్చిమం లేదు ఉత్తరం లేదు
ఈశాన్యం లేదుదక్షిణం లేదు
ఎక్కడైనా ఆమె కిందే!
కిమ్మనకుండా వుండాల్సిందే
రాజ్యం ఆమెదయ్యే దాకా!

– గిరి ప్రసాద్ చెలమల్లు
94933 88201

అద్దంలో అబద్ధం

అద్దంలో కొండ అబద్ధం!
కనీనికలో ప్రతిబింబించే మహాసముద్రం అబద్ధం!
తూర్పు పడమరల అంచుల్ని తాకే ఇంద్రధనస్సు అబద్ధం!
పాలల్లో ప్రవాసం చేసిన
నీళ్ల రంగు అబద్ధం

సిరిగల తల్లికి స్వాగతం పలికే
రొయ్యల చెరువుల్లో కంకులు వేసే వరి అబద్ధం
అనుమానం లేదు
నేతి బీరలో నెయ్యి లాగే
అన్నపూర్ణలో అన్నం అబద్ధం
బీట పొలాల్లో
పచ్చని పైరు పంట అబద్ధం
నెమలికన్నుకి చూపు రావటం అబద్ధం
పెట్రో రాక్షసి నోరు తెరవటం అబద్ధమైతే
వంటింట్లో అత్తింటి కోడళ్ళ జీవితానికి బీమా అబద్ధం
కురుక్షేత్రంలో జీవహింస అబద్ధం
ఆశను అడవిపాలు చేసి
శ్వాసను సగంలో తుంచేసి
ఎవరో వస్తారని ఏదో చేస్తారని
చేసుకున్న ఆత్మహత్యలో నిజం అబద్ధం
మంత్రాలకి చింతకాయల వర్షం అబద్ధం
హత్య నిజం .... రక్తం నిజం
ప్రాణంలేని పార్థిశంకర నిజం
స్వాహామంత్రం సిద్ధించిన స్వాములు
ఆధర వేదాలపై వర్ధిల్లే శాంతి వచనం అబద్ధం
కలలతో తెల్లారే రాత్రి నిజాయితీలో
అడవికి ఆస్తిపరులకి మధ్య
గురిపెట్టిన తుపాకీ కొనమీద
పావురాయి కాపురం అబద్ధం
సింహం శాకాహార వ్రతం అబద్ధం
మనిషి మనిషీ మతాల యాసలో
ఊరు ఊరు బాంబుల భాషలో పలకరించుకొనే
ఎడారి చీకటి బాటలో రైతుల కన్నీటి నధులు
జాతీయ అనుసంధానం అబద్ధం
జలజల పారే ఆనందాల అలలు అబద్ధం
విమర్శల సానరాయి పైన
అణువణువు అరిగరిగీ
అదృశ్యమైపోయిన మానవత్వం
తల పైన ప్రమాణం చేసి నిజం చెప్తున్నా పార్టీలు ఎన్ని మారినా
ప్రభుత్వాలు ఎన్ని తరించినా
పేదవాడి వేళ్ళు ఐదూ
పెదవల దాకా చేరటం పచ్చి అబద్ధం
నిశ్చింతే నిదురై పోయే రాత్రి అబద్ధం!

– ఈతకోట సుబ్బారావు
94405 29785

చావు లేని పాట

పాటే వినబడుతుంది
యేడ జూసిన
పాటే కనబడుతుంది
యే జాడనెతికిన

ప్రతి పల్లె వాడ ఇల్లిల్లూ
కడుపుగట్టి సాదుకున్న
పాట
హెూలే హెూలో రేలారే... ఏ... ఏ...
నగినానో సాగనో సాగా.... హాప్ అంటూ
ఆకాశమంత రాగమై గానమై
గజ్జెగట్టి దుంకుతున్న గద్దరన్న పాట

ప్రతి కొడుకు నోట
లచ్చుమమ్మ పాట
ప్రతి అన్న/ తమ్ముడి నోట
చెల్లెమ్మ పాట – ఆడపిల్ల పాట
పొడుస్తున్న పొద్దు నోట
పొద్దు తిరుగుడు పువ్వు పాట
ఇంతదాకా ఏ కవి రాయని
చెత్తకుండీ పాయఖానా పాట

దగాపడ్డ తెలంగాణ
గుండె చప్పుడు పాట
కారంచేడును కత్తిగ మల్చిన
దళిత పులుల పాట
పాలక వర్గాల నిలదీసిన
ప్రజా చైతన్య పాట
ఎర్ర జెండానెగరేసి ముద్దాడిన
లాల్ సలాం పాట

యుద్ధభూమికి నడిపించిన
ప్రజా యుద్ధనౌక పాట
నేల కొరకు నేలకొరిగిన
అమరుల త్యాగాల పాట
మరణమెరగని పాట
మరింత శక్తివంతమైన పాట
మరో ప్రపంచం కొరకు
మళ్ళీ పుడుతున్న పాట!

– అమృతరాజ్

వైవిధ్యభరిత కవిత్వం 'నీలకురింజి సముద్రం'

సమీక్ష



'నీలకురింజి సముద్రం' పేరిట వైవిధ్యమైన శీర్షికతో డాక్టర్ ఎం.ప్రగతి ఇటీవల కవిత్వ సంపుటి వెలువరించారు. ఈ కవిత్వంలో జీవితానుభవాలు, జ్ఞాపకాలు, అనుభూతులు, ఆత్మీయ ఆలింగనాలు మదిపొరల్లోంచి తెరలు తెరలుగా మన కళ్ళముందు ఆకాశమంత నీలికన్నులలోంచి నీలికురింజి సంద్రాన్ని చూస్తున్నట్లనిపించింది. కవితకు ఎత్తుగడ ఉంటేనే మస్తిష్కంలోకి పాదరసంలా పయనిస్తుంది. ఎంత గొప్పగా ఎత్తుగడ ప్రారంభమౌతుందో చూడండి.

రాలిన చినుకు నదిగా ఎప్పుడు మారిందో తెలీదు ప్రవహిస్తూ ఉండటం తన సహజ లక్షణం! (నిర్మల ప్రవాహిని). కవిత ఇతివృత్తాన్ని జీవితానుభవం నుండి.. స్వానుభవం నుండి తీసుకున్నట్లుంటుంది. కవితను ఆరంభించి ముగించడం కూడా యుద్ధంతో సమానమే. కవులు అప్పటికప్పుడు యుద్ధ మైదానాలవుతారు. ఎలాగంటే ...

తన ఇంటి గోడలకంటిన ఆకలి మరకలు/ మరో కంటికి కనిపించకూడదని/ కొడుకుగా వెల్లగా వెల్లువై నిలిచానన్నాడు/ కలాన్ని కలల్ని కాలానికొదిలేసి తను/ పెయింట్ బ్రష్షుగా మారిపోయానన్నాడు/ గోడల నిండా రంగులను వొంపేసి/ మెదడులో అక్షరాలను/ మిగుల్చుకోలేకపోయానన్నాడు/ చేతుల కంటిన రంగుల్ని కడిగేసుకోవడానికి/ తీరిక దొరకనివాడు/ మెదడులో పేరుకుపోయిన ఇక్కట్ల/ చీకటి రంగునెప్పుడు వదిలించుకుంటాడు/ అతనిప్పుడు ఖాళీ అయిన రంగుడబ్బా (అతనో ఖాళీ రంగుడబ్బా)

జీవితాన్ని ఉన్నతీకరించడమే సాహిత్యం యొక్క ప్రయోజనం. డా.ప్రగతి గారి ఆలోచన, ఆచరణ వేర్వరు కావు. రెండూ రెండు కన్నుల్లా కలిసి సాగుతాయి. ఈ కవిత్వం చదువుతున్నంతసేపూ తనకున్న ప్రాపంచిక దృక్పథం, సమాజం పట్ల బాధ్యత స్పష్టంగా కనిపిస్తాయి. నిర్దిష్టమైన సామాజిక, రాజకీయ దృక్పథం ఉన్నప్పుడు మాత్రమే గొప్ప కవిత్వం రాయడం సాధ్యం. ప్రణయ్ పరువు హత్యకు గురైనప్పుడు ఇలా రాశారు : **"నా ప్రేమను దహించిన కులోన్మాద జ్వాలల్లో నేనూ భస్మమై నా ఆగ్రహాన్ని ప్రకటించాలనుకున్నా.. ప్రణయగీతాన్ని చివరికంటా ఆలపించాలన్న నా కర్తవ్యాన్ని కనుమరుగైన నా తోడు గుర్తు చేసింది." (నీ బీభత్స ప్రేమ నాకొద్దు నాన్నా!).** కుల దురంకార హత్యల్ని ప్రశ్నిస్తూనే అసమానతల సమాజం అంతం కావాలని ఈ కవయిత్రి త్రికరణశుద్ధిగా కోరుకుంటారు. **"మనిషి పేరులోనూ రెండు పదాలు నింపుకుంటున్నాం. ఒకటి తనది.. మరొకటి మానవ సమూహం నుండి విడదీసేది. ఈ తోకలూ, కొమ్మలూ ఇంక అవసరమా? మన పిల్లలకైనా లేకుండా చేద్దాం/ అంతా మనవాళ్ళేనని నేర్పిద్దాం.." (మనోళ్ళేనా..)** ఎంత విస్పష్టంగా చెప్పారో కదా!

ఈ రోజు మన దేశంలో రాజకీయ వ్యవస్థ ఎంత అపసవ్యంగా నడుస్తుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రశ్నించే వాళ్ళను కారాగారాల్లో బంధిస్తున్న సందర్భం ఇది. మేథావుల్ని హత్య చేసేందుకు కూడా వెనకడుగువేయని దుర్మార్గ రాజకీయ వ్యవస్థలో మనం బతుకుతున్నాం. దీనిని గమనించి, ప్రకటించటానికి స్పష్టమైన రాజకీయ దృక్పథం ఉండి తీరాలి. తనకు ఉంది కాబట్టే ఈ కవయిత్రి ఇలా రాశారు : **ష్..అరవకండి/ ఈ దేశం రామరాజ్య స్థాపన కోసం సన్నదద్ధమవుతుంది/ ఆవు పంచకం చాలడంలేదు/ ప్రాంగణం శుభ్రం చేయడానికి../ ఆలయాల్లో సరికొత్త సంతర్పణలు/ బాల్యపు నెత్తుటి ధారలతో../ ప్రమిదల నిండా చమురు పోసి/ దీపాలు వెలిగించడం ఇంకానా?/ కాయాన్ని పిండి ఉన్మాద జ్వాలలు మండిద్దాం/ చక్కెర పొంగలి, పులిహెూర, దద్దోజనాలు పక్కనబెట్టి/ పసితనపు లేత శరీరాన్ని నైవేద్యంచేసేద్దాం/ పసిదైతేనేం శరీరం ఆడదేగా/ మదోన్మత్తు తీర్చుకుందాం/ దేవుడి మీదొట్టు!/ దేవుడికి నైవేద్యం పెట్టాకే/ రక్తమాంసాలతో పండగ చేసుకుంటాం./ మిగిలిన తునకలు అడవుల్లో/ కాకులకు గద్దలకు విసరేస్తాం./ ఆపైన అంతా రామరాజ్యమే.. (ష్)**

దేశ వర్తమాన పరిస్థితి ఎలా ఉందో ఈ కవిత అద్దం పడుతుంది. కవులు ఇలా ఎప్పటికప్పుడు ఈ పాలకులు అధికారం ముసుగులో చేస్తున్న దురాగతాలను ఎండగట్టాల్సిందే! ఆ పనే ప్రగతి ఈ కవిత్వం ద్వారా చేశారు. నేటి పాలకులు కార్పొరేట్లకు ఎలా అమ్ముడుబోతున్నారో ఈ కవిత చూడండి... : **" మంది కష్టంతో కరెన్సీ నోట్లు/ పండించుకుంటారొకరు/ మందికోసం చెమటబొట్లను తిండి గింజలుగా మారుస్తారింకొకరు.. (కొత్త ఉషస్సు కోసం).**

ఈ కవితా సంపుటిలో అనేక కవితలు అనుభూతులను కలిగించే భావ విన్యాసం చేస్తాయి. సామాజిక మాధ్యమాలొచ్చాక భావకవిత్వం విస్తృతంగా వస్తుంది. ఈ సంపుటిలోనూ ఇలాంటి కొన్ని కవితలు చూడొచ్చు. **'నీ మెడ శిఖరం చుట్టూ నా చేతులు/ సెలయేళ్ళై చుట్టుకుంటాయి./ నీ మమతల గిరుల మొదళ్ళు/ ఈ సెలయేళ్ళ చుట్టూ పచ్చని కాపు కాస్తాయి/ నా కురులు నీ మనసును/ ఊయలలూపే పిల్ల తెమ్మెరలవుతాయి/ నీ ఊపిరి సుగంధంనా సిగలో పోలకు పరిమళాన్నద్దుతుంది.'** ఇలా ఆత్మీయ బంధం కళ్లకు కట్టినట్టుగా ఈ కవిత సాగిపోతుంది. కవిత్వమంటే ఏమిటో ఈ విధంగా నిర్వచిస్తారు ఈ కవయిత్రి. **"కవిత్వమంటే అక్షరం కాదు అనుభూతి. భాషను మించిన భావం" "కాగితంపై అక్షరాలు గుమ్మరిస్తే కవిత్వం తయారైపోతుందా? అల్లిబిల్లి పదాల పూలను సౌరభాల మరువాన్ని పొందిగ్గాకూర్చితే తయారయ్యే కొత్తసుగంధం కవిత్వం కావాలి" అంటారు.**

ఈ సంపుటికి శీర్షికగా ఉన్న "నీలకురింజి సముద్రం" కవయిత్రి తన తండ్రి స్ఫురణతో రాసిన కవిత. **"నీ భుజం మీదకెక్కి /లోకాన్ని చూసిన దశ్యం /నాగెవనంలో లేదు నాన్నా.../ మా అమ్మో నాయనమ్మో / చెబితే తప్ప తెలియలేదు/ వూహ తెలిశాక లోకం చూశాక / నీకు నాకు మధ్య తెలీని దూరం/ అయినా నిన్ను చూస్తూనే పెరిగాను కదూ!/ నీ జేబుకు చిల్లుపడ్డాక కూడా/ నీ వేలి ఉంగరం మరెవరికో/ అక్కర తీర్చిందని తెలిశాక/ మా నాన్నంటే యెంత గర్వమో! / రాజకీయమద పొట్టేళ్లు కొన్ని/ నీ హెూదాను ఢీకొని కొమ్ములు విరగ్గొట్టుకున్నాక/ 'నువ్వు శానా గట్టోనివప్పో...' / మాటలో విరుపు పొగడ్తనో తెగడ్తనో/ చెప్పకనే చెబుతుంది/ ఆ మాటకు ముందో వెనుకో/వో జాతీయమో, మరో/ విశేషణమో/ వెక్కిరించినట్టు వినపడుతూనే వుంటుంది/ వాళ్ళ వెటకారాలకేం గానీ/ వాళ్ళెంత తలెత్తి చూసినా/ ఆ/ చూపులకందుతావా నువ్వు?/ నీ వ్యక్తిత్వం/ అరుదైన నీలకురింజి నగం!/ నీ హృదయం/ లోతెంతో తెలియని నీలాల సాగరం!/ "నీ బిడ్డంతా నీ తిన్ననేనప్పా/ మాటా మనిషీ..." అంటూ/ నీ నేస్తుల మెచ్చుకోళ్లు విన్నప్పుడు/ నీ ముఖంలో మెరుపు/ వాళ్ళ అమాయకత్వం గానీ/ నేను నువ్వెలా అవుతాను/ నువ్వో నీలకురింజి సముద్రం/ నేనో చిన్ని నీలలోహిత సుమాన్ని మటుకే!/ లోతెంతో తెలియని నీలాల సాగరం!"**

తన తండ్రి ఔన్నత్యాన్ని ఎంత గొప్పగా చెప్పారో కదా! మనసు తేలిక పడినట్లు.. అమాంతంగా వచ్చిన అలలు తనువును తడిపేసినట్లు.. ఆత్మీయతతో బుగ్గల్ని తడిపిన కన్నీటిధారలు ఎన్నో భావాలను మోసుకొచ్చినట్లు ఈ నీలకురింజి సముద్రం కనబడింది. ఈ సంపుటిలోని కవితలు కొన్ని వ్యవస్థని ప్రశ్నిస్తే.. మరికొన్ని పాలకుల దుర్నీతిని ఎండగడతాయి. ఇంకొన్ని కవితలు తాత్వికతనూ, అనిర్వచనీయమైన అనుభూతినీ పలికిస్తాయి. ఈసంపుటిలోని ప్రతి కవితా ప్రత్యేకించి ప్రస్తావించదగ్గదే! అందరూ చదివి ఆస్వాదించదగ్గదే!

– కెంగార మోహన్
94933 75447

ఖబడ్దార్ ...

చూడండి చూడండి
పగిలిన పత్తికాయల్లా కళ్ళు విప్పార్చుకుని
చూడండి తనివితీరా చూడండి
ఎత్తైన నునుపైన గుండ్రని అందమైన
నా రొమ్ముల్ని చూడండి
బాగా చూడండి
శిశుదశలో ఆకలికి ఆబగా తడుముకొని
పాలు తాగిన స్తనాలే కదా!
ఎవరు తొలగిస్తే నేమి
సిగ్గు వస్త్రాలు విప్పేసి వివస్త్రలుగా వీధుల్లో ఊరేగుతున్నప్పుడు
ధైర్యముంటే సిగ్గు లేకుండా చూడండి
ఇంద్రునిలా ఒళ్లంతా కళ్ళు చేసుకుని
రెండు తొడల మధ్య మర్మస్థానాన్ని
ఉమ్మనీటి సంద్రంలో తుళ్ళింతలాడుతూ
బాహ్య ప్రపంచంలోకి తొంగి చూచింది
ఆ జన్మభూమి నుండే కదా!
ఏముందక్కడ?
మీ అమ్మకి అక్కకి ఎవరికైనా అవే అవయవాలు కదా!

• • •

ఏమనాలి మిమ్మల్ని
మానవ మృగాలంటే
మృగాలకే అవమానం
తోటి జంతువులపై
అత్యాచారం పంజా విసరదు
అసురుడు అందామా
కీచకుడైనా ఆమె సౌందర్య జలపాతంలో
వివశుడయ్యాడే గాని
కొనగోటితోనూ ఆమె దేహవీణ మీటలేదు
రావణుడైనా అల్లంత దూరంలో
అశోకవనం చిరునామాలో ఉంచాడు గానీ
అంత్ణపురంలో దాచలేదు

• • •

నొప్పి సూదులు గుచ్చుకుని లుంగలు చుట్టుకుపోతూ
నెలనెలా మూడు రోజులు నరకం అనుభవించిన
ఈ దేహపుష్పం నాదేననుకున్నాను ఇప్పటివరకు
తొమ్మిది నెలలు నాది కాని బరువు మోసి మోసి
పిల్లలకు ప్రాణం పోసి మరో సృష్టి సంతకాన్నై
కొత్త జన్మ ఎత్తిన కరకు హింసాక్షణాల్లో
ఈ దేహనది నాదేననుకున్నాను
ఆనాడు కురుసభలో వస్త్రాపహరణ పరాభవం నుండి
నేడు మణిపురం వీధుల్లో నగ్న ఊరేగింపు వరకు
ఈ శరీరం నాది కాదని
ఈ మగాహంకార సమాజం ప్రేలాపనలు

• • •

సామ్రాజ్యం కోసమో సంపదల కోసమో
ఉన్మత్త రణబీభత్సానందంలో మునిగిపోతూ
విజయ గర్వంతో మీసాలు మెలేసి
చెరుకు తోటలో ఏనుగులు తొక్కి విధ్వంసం చేసినట్లు
శత్రురాజ్య స్త్రీల దేహ వనంలో అడుగుపెట్టి
అహంకారాగ్నిని చల్లార్చుకోవాలనుకుంటావు
దేవతలుగా పూజించిన చేతులతోనే
దేహరాజ్యాన్ని దురాక్రమిస్తావు
లిలిలి
కాలికడ్డం వచ్చిన రాయిలా
నేలలో తడిసి నానిన కొయ్య ముక్కలా
వానల్లో ఎండల్లో తడుస్తూ పగుళ్ళు బారిన
శిధిల ప్రతిమలా ఎంత లోకువ
మీకిష్టం వచ్చినప్పుడు సవస్త్రలుగానో
ఇష్టం లేనప్పుడు వివస్త్రలుగానో ఊరేగడానికి
మేమేమీ మీ చేతి బొమ్మలం దిష్టిబొమ్మలం కాము

• • •

ఎదురు తిరిగామంటే
ఒక్కొక్కరం భద్రకాళులం రుద్రమదేవులం
ఖబడ్దార్! ఒళ్ళు దగ్గర పెట్టుకోండి
చరిత్రను కొత్తగా రాస్తాం మేమిప్పుడు !

– మందరపు హైమవతి
94410 62732

రచనలో కవిత్వం జీవధాతువుగా ఉండాలి

సంభాషణ

ఇటీవల కేంద్ర సాహిత్య అకాడెమీ వారిచే ప్రతిష్ఠాత్మక 'భాషా సమ్మాన్' పురస్కారం పొందిన సందర్భంగా ఆచార్య బేతవోలు రామబ్రహ్మంతో సంభాషణ టూకీగా ...

కేంద్ర సాహిత్య అకాడమీ వారి భాషా సమ్మాన్ పురస్కారాని ఎంపికవడంపై మీ అనుభూతి ...

'భాషా సమ్మాన్' ఆనందాన్ని, సంతప్తిని పుష్కలంగా కలిగించిందన్న మాట వాస్తవం. ప్రాచీన–మధ్య యుగాల సాహిత్యాన్ని (క్రీ.శ 11 నుంచి 18వ శతాబ్ది) ఆధునిక పాఠకులకు చేరువజేస్తున్న కృషికి గుర్తింపు. దక్షిణ భారతీయ భాషల్లో ఎవరో ఒకరికి మాత్రమే ఇచ్చే పురస్కారం. 'దేవీభాగవతం' అనువాదానికి అకాడమీ పురస్కారం వచ్చినప్పటికన్నా, ఇప్పటి ఆనందం మిన్న. మునుపు 'ప్రెసిడెంట్స్ సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్సు' పొందినప్పటి ఆనందంతో సరిసమానమైన సంతప్తి, ఆనందం కలిగాయి.

హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రంలో తెలుగుకు మీరు చేసిన కషి?

ఈ కేంద్రాన్ని యూజీసి నుంచి ప్రత్యేకంగా మంజూరు చేయించి మరీ నాకు అప్పజెప్పారు. ఈ కేంద్రంలో దాసరి లక్ష్మణస్వామి గారు సంకలనం చేసిన ఏడు వేల పద్యాల గ్రంథానికి 'పాఠకమిత్ర వ్యాఖ్యానం'తో 'వర్ణన రత్నాకరం' పేరుతో 23 సంపుటాలు ప్రచురింపజేయడం. నేను, అద్దంకి శ్రీనివాస్, నరాల రామారెడ్డి, ఆర్వీఆర్కే శాస్త్రి ... ఇలా ఎంతోమంది కలిసి వ్యాఖ్యానం సమకూర్చాం. నా పదవీకాలం పొడిగించి మరీ ఆ 23 సంపుటాలను పూర్తిచేయడానికి అవకాశం కల్పించారు.

మీరు తెలుగుపై కాక ఎక్కువ సంస్కృత కావ్యాల మీదనే ఫోకస్ పెట్టడానికి కారణం?

అలా అని ఏమీ లేదు. తెలుగు పద్య కావ్యాలను ఆధునిక పాఠకులకు అందించే విషయానికే అగ్రతాంబూలం ఇచ్చాను. ఆ కోవలో హరివంశము, కేయూరబాహు చరిత్రము, రాజశేఖర చరిత్ర, వరాహపురాణం, ఉత్తర రామాయణం, పద్మీ భాగవతం వంటి ఎన్నో తెలుగు గ్రంథాలకు వ్యాఖ్యానం రాశాను. అలా నా వ్యాఖ్యాన స్రవంతి తెలుగు, సంస్కృతాలు రెండింటిలోనూ సాగుతూ ఉంది.

పద్య ప్రక్రియ ఇప్పుడెలా ఉంది?

వచనమైనా, పద్యమైనా అందులో కవిత్వం లేకపోతే ఎవరిని ఆకర్షించదు. కవిత్వం జీవధాతువులాగా ఉండాలి. ఏ ప్రక్రియైనా ప్రజలు నెత్తిమీద పెట్టుకోవడానికి కానీ, నేలకు విసిరి కొట్టడానికి గాని, ఆయా కవులే కారణమని నా అభిప్రాయం. ఇప్పుడు అన్ని ప్రక్రియలూ నువ్వా నేనా అన్నట్టు హెూరెత్తుతున్నాయి. అందుకని పద్యమైనా, వచన కవిత్వమైనా దేనికీ ఢోకా లేదు.

యువ కవులకు మీ సందేశం ఏమిటి?

నా సందేశం ఒక్కటే – ప్రాచీన సాహిత్యంలో కూడా ఎంతో కవిత్వ పటుత్వ సంపద దాగి ఉంది. మీ కోసం మేమందరం శ్రమపడి రాస్తున్న వ్యాఖ్యానాలను శ్రద్ధగా చదవండి. లబ్ధి పొందండి. మా శ్రమ వథా కానివ్వకండి.

– డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య
94904 00858

కరుణ రసాత్మకం 'దగ్ధగోళం'

పుస్తకం



'దగ్ధగోళం' దీర్ఘ కవితా సంపుటి పేరులోనే ఎంతో ఆవేదనని, బాధని, పొంగిపొర్లే దుఃఖాన్ని మమేకం చేసుకొని ఉంది. కోవిడ్ కారణంగా ప్రపంచమంతా అల్లాడిపోయిన దు:ఖభరిత సందర్భాలకు ఈ దీర్ఘ కవిత అక్షర రూపం. దీనిని వెలువరించిన డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు ఆచార్యులుగా విద్యార్థులకు తెలుగు భాషలోని తియ్యందనాల్ని అందించారు. డోలు, ఘటం, కంజీర వాద్యాల్లో ఉన్నతశ్రేణి కళాకారునిగా ఎమ్మెస్ సుబ్బలక్ష్మి, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ గార్లతో కలిసి కచేరీల్లో పాల్గొన్న గొప్ప కళాకారులు. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగిన కరోనా వైరస్ భూగోళాన్ని దగ్ధం చేస్తుంటే – ప్రపంచ మానవుని ఆర్తనాదాలను తన బాధలుగా భావించి 18 భాగాలుగా ఈ దీర్ఘ కవితను అందించారు.

మొదటి భాగంలో కరోనా మన దేశంలోకి వచ్చీ రావడంతోనే నెలకొన్న అయోమయ వాతావరణాన్ని వివరించారు. పోరాటం సాగిస్తున్న కొద్దీ అది తీవ్ర రణరంగంగా మారిందంటారు. మనిషిలోని స్వార్థం, అత్యాశల ఫలితమే కరోనా మనిషిని పచ్చి పుండులా చేసిందన్నారు. కరోనా రూపంలో ప్రకృతి విలయతాండవం చేస్తుంటే మానవుడు చావు కేక పెట్టడం తప్పించి ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాడని ఎంతో ఆవేదనగా చెప్పారు.

రెండవ అధ్యాయంలో ఎంతోమంది పెద్దలకు చాకిరీ చేస్తూ, వాళ్ళ కాలి కింద చెప్పులా సామాన్యుడు బలి పశువు అవుతున్న సామాజిక పరిస్థితుల్ని కళ్లకు కట్టినట్లు చెప్పారు. ఒక్క ప్రాణం హరిస్తే ఆ ప్రాణిని ఆసరాగా చేసుకుని ఎన్ని జీవాలు నిరాధారమైనా న్యాయదేవతకు ఒకింతయినా కనికరం లేదంటారు. మరణించిన వారి కోసం కనీసం కాటిదాకా కూడా వెళ్లలేని స్థితిలో మానవుడు ఉన్నాడని బాధపడ్డారు. మూడవ అధ్యాయంలో – ప్రకతి మనకు అన్ని ప్రసాదించి ముందుకు నడిపిస్తున్నా కూడా మనిషి భూమాతని కాలదన్ని ఆకాశానికి నిచ్చెనలు వేస్తుంటే కాలం కూడా నిశ్చేష్టురాలయిందని అన్నారు. పోగొట్టుకున్న కాలాన్ని తిరిగి తెచ్చుకోలేమని తెలిసి కూడా ధనం కోసం పాకులాడుతూ మునగడానికి సిద్ధంగా ఉన్న పడవలా ఉన్నాడు మనిషి అంటారు రచయిత. కరోనా విపత్తుతో నాలుగు గోడల మధ్య జీవనం సాగిస్తూ సూర్య కాంతిని కూడా చూడలేక ప్రతిరోజూ అమావాస్య లాగే జీవిస్తున్నాడని ఆవేదనగా చెప్పారు.

నాలుగవ అధ్యాయంలో కోవిడ్ కాటుకు బలైన మనుషులు కుప్పలు తెప్పలుగా శవాలుగా మారిన వైనాన్ని తెలియజేశారు. రుద్ర భూములన్నీ యుద్ధ భూములై శత్రువుని చూడకుండానే దీపం తాకిన మిణుగురులా విలవిల్లాడుతున్నారు అంతా. నదులన్నీ శవపేటికల్ని మోస్తుంటే హారతులన్నింటిని శవపేటికలు అందుకుంటున్నాయని అన్నారు. ఐదవ అధ్యాయంలో కంటికి కనిపించని వైరస్ ఎన్ని యుద్ధాలు సష్టించినా, రక్తం ఓడుతున్నా అన్నింటినీ తన కడుపులోనే దాచుకుంది భూమాత. మనిషి కూడా మాట పలుకు లేక భయంతో కంపించి పోతున్నాడు. అతి తెలివితో తయారుచేసిన మారణాయుధాలు వైర విక్రయాలై రగులుతూ శాపాలుగా మారాయని కవి బాధాతప్త హృదయంతో చెప్పారు.

ఆరవ అధ్యాయంలో శబ్దజీవి అయిన మనిషి తీరుని చెప్పారు రచయిత. పుడుతూనే కెవ్వుమనే శబ్దంతో పుట్టిన మానవుడు నిశ్శబ్ద వైరస్ సష్టిస్తున్న అలజడికి శబ్ద తరంగాలు అన్ని మూగబోయి ఫోన్ పలకరింపులతో రేపటి తరానికి గుణపాఠంగా నిలిచాయి అంటారు.

ఏడవ అధ్యాయంలో దిన దిన గండంగా మారిన మానవుని జీవనయానం గురించి కన్నీటి పర్యంతరంగా చెప్పారు. ఎనిమిదవ అధ్యాయంలో కరోనా విజృంభణ తరుణంలో కొందరు నకిలీ వస్తువులు, నకిలీ మందులు అమ్ముతూ స్వార్థం ప్రదర్శిస్తున్నందుకు ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదవ అధ్యాయంలో ఇప్పుడిప్పుడే దేశాలన్నీ కళ్ళు తెరుస్తూ కళ్ళకు కప్పేసిన పొరలని తొలగించుకున్న వైనాన్ని చెప్పారు. పదవ అధ్యాయంలో కుటుంబ బంధాలు దూరమై ఇగిరిపోతున్న గంధంలా పొరలు పొరలుగా రాలిపోతూ ఎడారి బతుకుల్లా మిగిలిపోతున్న వైనాన్ని చెప్పారు. 11వ అధ్యాయంలో కరోనా కల్లోలానికి మనిషి కారాగార వాసం అనుభవిస్తూ పని దొరికితే కానీ తిండి దొరకని పేదవాడి ఆవేదనని తెలియజేశారు. ధనవంతుడు కరోనా కాదు కదా కరోనా తాత వచ్చినా కూడా అరచేతిలో వైకుంఠాన్ని చూస్తాడంటారు. ఇదే అదనుగా వ్యాపారస్తులు, ప్రభుత్వాలు దోచుకుంటున్న వైనాన్ని వివరించారు. 12వ అధ్యాయంలో కుటుంబ సభ్యులు ఎవరూ రాని ఏకాంత వాసంలో వైద్యులు, రక్షకభటులు, నర్సమ్మలు, ఎందరో సేవకులు అందించిన సేవల్ని ప్రాణదాతలుగా అభివర్ణించారు.

13వ అధ్యాయంలో కరోనా విపత్తులో పారిశుధ్య కార్మికులు అందించిన సేవలను ప్రస్తావించారు. 14వ అధ్యాయంలో కరుకురాతి గుండెల్లో కరుణ రసం నింపుకొని అహెూరాత్రులు శ్రమించి కరోనా రక్కసిని ఎదిరించిన తీరుని చాలా చక్కగా చెప్పారు. 15వ అధ్యాయంలో వలస కూలీల వెతలను ప్రస్తావించారు. 16వ అధ్యాయంలో కొందరు పెద్ద మనసుతో రోడ్డున పడ్డ ఎందరో అభాగ్యులకి సహాయపడిన తీరును కరుణరసాత్మకంగా చెప్పారు. 17వ అధ్యాయంలో కవులు ఈ కష్టకాలంలో తమ ఆవేదనను, ఆసరాను కవిత్వీకరించి మానవత్వాన్ని తట్టి లేపారని కితాబునిచ్చారు. 18వ అధ్యాయంలో కరోనాతో పాటు ఇంకా అనేక వ్యాధులు అలజడిని రేపినా, మానవుడు ప్రకృతికి తలపెడుతున్న కీడుని ఎంతో బాధగా చెప్పారు. ఇలా ఒక దు:ఖభరిత కల్లోల సమయాన్ని కవి దీర్ఘ కవితగా రికార్డు చేయడం అభినందనీయం. పుస్తకం కోసం కవిని 98483 61627 నంబర్లో సంప్రదించవచ్చు

– పింగళి భాగ్యలక్ష్మి
97047 25609

గద్దర్ స్ఫూర్తి సంచిక కోసం రచనల ఆహ్వానం

'ప్రజా యుద్ధ నౌక గద్దర్ యాదిలో బహుజన కెరటాలు మాసపత్రిక వెలువరించే స్ఫూర్తి సంచిక కోసం రచనలను ఆహ్వానిస్తున్నాం. గద్దర్ జీవితం, ఉద్యమ ప్రస్థానాన్ని, పాటలను విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలను, కవితలను ఆగస్టు 31లోపు bahujanakeratalu2001@gmail.com కు మెయిల్ చేయాలి. లేదా 79898 80088 (పల్నాటి శ్రీరాములు, బహుజన కెరటాలు వ్యవస్థాపకుడు) నెంబర్‌కి వాట్సాప్ ద్వారా పంపించవచ్చు. **– బహుజన కెరటాలు సంపాదకవర్గం**

చలపాక ప్రకాష్‌కు సీనియర్ ఫెలోషిప్

కవి, రచయిత చలపాక ప్రకాష్ కేంద్రప్రభుత్వ సాంస్కతిక మంత్రిత్వ శాఖ వారి సీనియర్ ఫెలోషిప్‌కు ఎన్నికయ్యారు. 2020–2021 సంవత్సరానికి గాను ఈ ఫెలోషిప్ 'తెలుగు సాహిత్యంలో కరోనా కల్లోలం' అంశంపై 2 సంవత్సరాలపాటు పరిశోధించి పత్రసమర్పణ చేయవలసి ఉంటుంది. ఈ పరిశోధనకుగాను ప్రకాష్‌కు రెండేళ్లపాటు నెలకు రూ.20 వేలు చొప్పున గౌరవ వేతనంగా అందిస్తారు. గతంలో ఇదే సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నుంచి 'అత్యాధునిక కవితారూప ప్రక్రియ–నానీ' అనే అంశంపై పరిశోధన చేసి చలపాక జూనియర్ ఫెలోషిప్ అందుకున్నారు.

యువ సాహిత్య ప్రతిభా పురస్కారం కోసం ...

యువ సాహిత్య ప్రతిభా పురస్కారం కోసం యువకవుల/ కవయిత్రులు నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. వయస్సు 18 – 35 సంవత్సరాల మధ్య ఉండాలి. కనీసం నాలుగు కవితలు ప్రముఖ పత్రికల్లో ప్రచురింపబడి ఉండాలి. దానితో పాటు నాలుగు పోటీలలో విజేతలుగా నిలిచి ఉండాలి. ఎన్నిక కాబడిన యువకవికి/ కవయిత్రికి 5,116 నగదు బహుమతి, జ్ఞాపికతో సెప్టెంబర్ నెలలో హైదరాబాద్‌లో సత్కారం ఉంటుంది. దరఖాస్తులను ఐ.బి.ఆర్.ఎఫ్.సభ్యులు –డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్, చరవాణి : 9490841284 వాట్సాప్‌కు 31.8.2023 లోపు పంపాలి.

– డాక్టర్ రాధా కుసుమ,
కుసుమ ధర్మన్న కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు,



తుది ఘట్టానికి చేరువలో చంద్రయాన్-3

న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం తుది దశకు చేరుకున్నది. చంద్రుడిపైకి రష్యా పంపిన లునా-25 విఫలం కావటంతో ఇప్పుడు యావత్ ప్రపంచం దృష్టి భారత చంద్రయాన్-3 పైనే పడింది. ఇలాంటి తరుణంలో స్పేస్‌క్రాఫ్ట్‌లోని విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్ చివరి చంద్ర కక్ష్య కదలికను పూర్తి చేసి, ఆగస్టు 23న చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నించే కక్ష్యకు చేరుకున్నదని ఇస్రో వెల్లడించింది. ఆగస్టు 23వ తేదీ సాయంత్రం 6.04 గంటల సమయంలో చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ అడుగుపెట్టనుందని తెలిపింది. చంద్రయాన్-3 జులై 14న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- దారుణంగా ఆర్థిక వ్యవస్థ
- పరకాల ప్రభాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

భారత దేశంలో ప్రజాస్వామ్యం అత్యంత ప్రమాదస్థితిలో ఉందని ప్రముఖ రచయిత పరకాల ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతిపక్ష రాజకీయ పార్టీల వ్యూహ రచనలో ఎక్కడో లోపం కనిపిస్తున్నదని సందేహం వ్యక్తం చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం, మంచి పుస్తకం సంస్థల సంయుక్తాధ్వర్యంలో పరకాల ప్రభాకర్ రచించిన "ది క్రూక్డ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా" పుస్తక పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గతంలో ఎన్నడూ లేనంతగా 23 శాతం యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారనీ, నిరుద్యోగ సూచీల్లో భారతదేశం స్థానం లెబనాన్, లిబియా, ఇరాన్ వంటి దేశాల సరసన ఉన్నదని తెలిపారు. ఇదే అంశంలో పొరుగున్న ఉన్న బంగ్లాదేశ్ 12వ స్థానంలో ఉన్నదని ఉదహరించారు. దేశంలో 2014-15 నాటికి 120 మంది బిలియనీర్లు ఉంటే, గడచిన పదేండ్లలో వీరి సంఖ్య 145కి పెరిగిందనీ, అదే సమయంలో 84 శాతం మంది ప్రజల నికర ఆదాయం క్రమంగా పడిపోతున్నదని విశ్లేషించారు. జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో తయారీరంగం పూర్తిగా కుదించుకుపోతున్నదనీ, కేంద్ర ప్రభుత్వం సాధించినట్టు చెప్తున్న 7 శాతం జీడీపీలో ఈ రంగానికి ఉన్న వాటా కేవలం 1.3 శాతం మాత్రమేనని తెలిపారు.

కర్ణాటకలో కుప్పకూలిన డిఆర్‌డిఒ యుద్ధ విమానం

బెంగళూరు : రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ)కి చెందిన మానవరహిత టెస్టింగ్ యుద్ధ విమానం ఆదివారం కర్ణాటకలో కుప్పకూలింది. చల్లకెరె సమీపంలోని కుదాపురా వద్ద డిఆర్‌డిఒకి చెందిన ఓ టెస్టింగ్ విమానం వ్యవసాయ పొలంలో కూలిపోయిందని చిత్ర దుర్గ ఎస్‌పి కె. పరశు రామ్ చెప్పారు. స్థానికులు తపస్ 07ఎ-14 విమానాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, డిఆర్‌డిఒ బృందం ఘటనా స్థలానికి చేరుకున్నామని అన్నారు. కూలిపోయిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అన్నారు.

పాక్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- 20 మంది ప్రయాణికుల మృతి

ఇస్లామాబాద్ : ఇంధన డ్రమ్ములతో ఆగి వున్న వ్యాన్‌ను ప్రయాణికులతో వెళుతున్న బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. పాకిస్థాన్‌లో ఆదివారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటనలో మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. పంజాబ్ రాష్ట్రంలోని పిండి భట్టైన్ వద్ద జాతీయ రహదారిపై తెల్లవారుజామున ఈ దారుణం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 40 మందికిపైగా ప్రయాణికులు ఉన్నారని, వారంతా నిద్రలో ఉన్నారని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. మృతుల్లో రెండు వాహనాలకు చెందిన డ్రైవర్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇంధన డ్రమ్ములతో ఉన్న వ్యాన్‌ను బస్సు ఢీకొనడంతో రెండు వాహనాల్లోనూ ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా వ్యాపించాయి. కొన్ని నిమిషాల్లోనే బస్సు పూర్తిగా దగ్ధమై, ఇనుప ఫ్రేమ్ మాత్రమే మిగిలింది.

అఖిలేష్ యాదవ్‌తో రజనీకాంత్ భేటీ

లక్నో : సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్‌తో ఆదివారం ప్రముఖ నటులు రజనీకాంత్ సమావేశమయ్యారు. అఖిలేష్ నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం మీడియాతో రజనీకాంత్ మాట్లాడుతూ అఖిలేష్ యాదవ్‌తో సమావేశమవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. యాదవ్‌ను స్నేహితుడిగా సంబోధించారు. 'తొమ్మిది సంవత్సరాల క్రితం ముంబయిలో ఒక కార్యక్రమంలో అఖిలేష్‌తో సమావేశమయ్యాను. అప్పటి నుంచి మా స్నేహం కొనసాగుతోంది. మేం ఫోన్ ద్వారా మాట్లాడుకునేవాళ్లం' అని రజనీకాంత్ తెలిపారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి అదిత్యనాథ్‌తో శనివారం రజనీకాంత్ సమావేశం వివాదస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఈ వారం ప్రారంభంలో జార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌తో రాంచీలోని రాజ్‌భవన్‌లో రజనీకాంత్ సమావేశమయ్యారు

ఉత్తరప్రదేశ్‌లో మరో ఘాతుకం

- ముస్లిం దంపతుల దారుణ హత్య

లక్నో : యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ హయాంలో ముస్లిములపై దాడులు తీవ్రమయ్యాయి. తమ కుమార్తెను ముస్లిం యువకుడు తీసుకెళ్లి, వివాహం చేసుకున్నాడన్న కోపంతో హిందూ యువతి కుటుంబ సభ్యులు ముస్లిం దంపతులను దారుణంగా హత్య చేశారు. ఇనుప రాడ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మరణించారు. గత శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఉత్తర ప్రదేశ్‌లోని సీతాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ చక్రేష్ మిశ్రా తెలిపారు. ఆయన, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సీతాపూర్ ప్రాంతానికి చెందిన అబ్బాస్, కమ్రుల్ నిషాల కుమారుడు షౌకత్ అదే ప్రాంతానికి చెందిన రాంపాల్

కుమార్తె రూబీ ప్రేమించుకున్నారు. 2020లో మైనర్‌గా ఉన్న రూబీని 28 ఏళ్ల షౌకత్ అపహరించాడంటూ ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 13 నెలల జైలు జీవితం అనంతరం విడుదలయ్యాడు. ఈ ఏడాది జూన్‌లో మళ్లీ షౌకత్, రూబీ పారిపోయి పెళ్లి చేసుకున్నారు. ఈ విషయమై కేసు నమోదైంది. అప్పటికే మేజర్ అయిన రూబీ షౌకత్‌కు అనుకూలంగా కోర్టులో వాంగ్మూలం ఇచ్చింది. ఆ తరువాత వేరొక కేసులో షౌకత్‌ను రెండు నెలల క్రితం పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. రాంపాల్ కుటుంబ సభ్యులు షౌకత్ తల్లిదండ్రులు అబ్బాస్, కమ్రుల్ నిషాలపై శుక్రవారం ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేశారు.

దీంతో, అక్కడికక్కడే ప్రాణాలు విడిచారని స్థానికులు చెప్పారని ఎస్‌పి తెలిపారు. గ్రామంలో పోలీసు బలగాలను మోహరించామని చెప్పారు. ఈ కేసులో రూబీ సోదరుడు, ఆమె బావ, ఆ కుటుంబ స్నేహితుడిని అరెస్టు చేశామని తెలిపారు. ఆమె తల్లిదండ్రుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

స్టాండింగ్ కమిటీకి ఆ మూడు బిల్లులు

- మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని రాజ్యసభ ఛైర్మన్ ఆదేశం
- తక్కువ వ్యవధిలోనే చర్చలకు జాబితా చేయడంపై ప్రతిపక్ష ఎంపిల ఆగ్రహం

న్యూఢిల్లీ: భారతీయ న్యాయ సంహిత బిల్లు 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బిల్లు 2023, భారతీయ సాక్ష్య బిల్లు 2023లను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (హోం వ్యవహారాలు)కి రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ సిఫార్సు చేశారు. ఈ బిల్లులను పరిశీలించి మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ బిల్లులను ఈ నెల 11న కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుతో ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సిఆర్‌పిసి), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లను భర్తీ చేయాలని కేంద్రం భావిస్తుంది. ఈ బిల్లులను ప్రవేశపెడుతూ.. ఇవి భారతదేశ నేర న్యాయ వ్యవస్థను మారుస్తాయని షా చెప్పారు. సత్వర న్యాయం అందించడానికి, ప్రజల సమకాలీన అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయ వ్యవస్థను రూపొందించడానికి ఈ బిల్లును రూపొందించామని తెలిపారు. వీటిపై అనేక విమర్శలు వెల్లు వెత్తుతున్న నేపథ్యంలో వీటిని స్టాండింగ్ కమిటీకి రాజ్యసభ్య చైర్మన్ సిఫార్సు చేశారు. ఈ విషయాన్ని రాజ్యసభ సెక్రటేరియట్ శుక్రవారం ఒక బులెటిన్ ద్వారా వెల్లడించింది. ఈ బిల్లులను పరిశీలించి మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు కూడా తెలిపింది. అదే రోజు రాత్రి పార్లమెంటరీ కమిటీ సభ్యులకు ఈ బిల్లులకు చెందిన వివిధ అంశాలపై వివరణకు, చర్చలకు ఈ నెల 24, 25, 26న సమావేశం ఉందని కేంద్ర హోం శాఖ నోటీసు జారీ చేయడం మరింత వివాదంగా మారింది. కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా ఈ నోటీసు జారీ చేశారు. తక్కువ వ్యవధిలోనే బిల్లులపై వివరణ సమావేశం ఏర్పాటు విషయాన్ని ప్రకటించడంపై కమిటీలో ముగ్గురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపి దిగ్విజయ్ సింగ్, టిఎంసి ఎంపీలు డెరెక్ ఓ బ్రియాన్, కకోలీ ఘోష్ దస్తిదార్ ఈ మేరకు లేఖ రాశారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24నే "జైలు-పరిస్థితుల మౌలిక సదుపాయాలు-సంస్కరణలు" అంశంపై ముసాయిదా నివేదికను ఆమోదించడానికి కమిటీ సమావేశం కావాల్సి ఉందని గుర్తు చేశారు. కాబట్టి, తేదీలను సవరించాలని, సెప్టెంబర్ నెలలో ఈ సమావేశం పెట్టాలని సూచించారు. భారీ పరిమాణంలో ఉన్న మూడు బిల్లులపై వివరణ, చర్చలకు తక్కువ రోజులు మాత్రమే కేటాయించడాన్ని తప్పు పట్టారు. అలాగే, ఒకే రోజును బిల్లును కమిటీ సిఫార్సు చేస్తున్నట్లు ప్రకటించడం, అదే రోజున చర్చల కోసం జాబితా చేయబడినట్లు నోటీసులు ఇవ్వడంపై సభ్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉభయ సభలకు చెందిన సభ్యులను కలిగిన ఈ పార్లమెంటరీ కమిటీకి బిజెపి ఎంపి బ్రిజ్ లాల్ చైర్మన్‌గా ఉన్నారు.

సంయుక్త ప్రకటన లేకుండానే ముగిసిన జి20 ఆరోగ్య మంత్రుల సమావేశం

న్యూఢిల్లీ : రెండు రోజుల పాటు జరిగిన జి20 దేశాల ఆర్యోగ శాఖ మంత్రుల సమావేశం శనివారం ఎలాంటి సంయుక్త ప్రకటన లేకుండానే ముగిసింది. ఇప్పటి వరకూ జరిగిన మిగిలిన జి20 మంత్రులు సమావేశాల మాదిరిగానే సంయుక్త ప్రకటన జారీకి రష్యా-ఉక్రెయిన్ మధ్య వివాదమే అడ్డు పడింది. సంయుక్త ప్రకటనకు బదులుగా సమావేశం సారాంశాన్ని, అవుట్ కమ్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. యుద్ధాన్ని ఖండిస్తూ పొందుపర్చిన డాక్యుమెంట్‌లో పేరా 22పై రష్యా, చైనా అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ పేరా జి20 నిబంధనలకు అనుగుణంగా లేదని రష్యా, విమర్శించగా, భద్రతా సమస్యలను పరిష్కరించడానికి జి20 సమావేశం వేదిక కాదని చైనా అభ్యంతరం తెలిపింది. ఈ పేరాను మినహాయించి మిగిలిన డాక్యుమెంట్‌ను అన్ని సభ్యదేశాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. గ్లోబల్ హెల్త్ ఆర్కిటెక్చర్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఒ) ప్రధాన పాత్ర పోషిస్తోందని సభ్య దేశాలు పునరుద్ఘాటించాయి. సురక్షితమైన, ప్రభావవంతమైన, నాణ్యతతో కూడిన మందులు, వ్యాక్సిన్లు, రోగ నిర్ధారణలు అన్ని దేశాలకు సమానంగా అందుబాటులో ఉండాలని సభ్య దేశాలు అంగీకరించాయి.

సిడబ్ల్యుసి పునర్వ్యవస్థీకరణ

- సచిన్ పైలట్, శశిథరూర్‌కు స్థానం..

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి)ని పునర్వ్యవస్థీకరించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో నిర్ణయాలు తీసుకునే అత్యున్నత స్థాయి వ్యవస్థ సిడబ్ల్యుసిని రాజీవ్‌గాంధీ జయంతి రోజున పునర్వ్యవస్థీకరించారు. 39 మంది సిడబ్ల్యుసి జనరల్ సభ్యులు, 18 మంది శాశ్వత ఆహ్వానితులు, 14 మంది ఇన్‌ఛార్జ్‌లు, 9 మంది ప్రత్యేక ఆహ్వానితులు, నలుగురు (యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ అధ్యక్షులు) ఎక్స్ అఫిషియో సభ్యులుగా నియమితులయ్యారు. సభ్యుల్లో మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, అధిర్ రంజన్ చౌదరి, కమ్యూనికేషన్ల విభాగం ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్.రఘువీరారెడ్డి ఉన్నారు. కాంగ్రెస్ అసమ్మతి వర్గంగా పేరొందిన జి20 నేతలు ఆనంద శర్మ, ముకుల్ వాస్నిక్,

శశిథరూర్, మల్లికార్జున ఖర్గే (ఫైల్)

కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి పోటీ చేసిన శశి థరూర్ వంటి నేతలకు కూడా చోటు దక్కింది. రాజస్థాన్ యువ నేత సచిన్ పైలట్, దీపా దాస్ మున్షి, సయ్యద్ నసీర్ హుస్సేన్‌లను కొత్తగా సిడబ్ల్యుసిలోకి తీసుకున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు, చేర్పులు చేసినట్లు తెలుస్తోంది. ప్రియాంక గాంధీని కూడా సిడబ్ల్యుసిలో చేర్చారు. దీంతో ఉత్తరప్రదేశ్ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుండి ఆమె తప్పుకోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. సీనియర్ నేతలు వీరప్ప మొయిలీ, మనీశ్ తివారీల పేర్లు ప్రత్యేక ఆహ్వానితుల జాబితాలో ఉన్నాయి. యువనేతలకు అవకాశం కల్పించాలన్న యోచనలో కొత్త ప్యానెల్ ఏర్పాటైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఇమ్రాన్ ఖాన్ సన్నిహితుడు ఖురేషి అరెస్ట్

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ విదేశాంగ మంత్రి, ఇమ్రాన్ ఖాన్ సన్నిహితుడు షా మెహమూద్ ఖురేషీ (67)ని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఇస్లామాబాద్‌లోని ఆయన నివాసం నుండి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఖురేషి పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పిటిఐ) వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. అరెస్ట్ అనంతరం ఆయనను ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్‌ఐఎ) ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఖురేషీ ఏ అభియోగాలపై అరెస్ట్ చేశారన్న అంశంపై వివరాలు స్పష్టంగా లేవు. దౌత్యపరమైన కేబుల్ మిస్సింగ్‌కు సంబంధించిన కేసులో ప్రస్తుతం జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్‌ని ఎఫ్‌ఐఎ విచారిస్తోన్న సంగతి తెలిసిందే. పార్టీ వైస్ చైర్మన్ షా మెహమూద్ ఖురేషీని మరోసారి అక్రమంగా అరెస్ట్ చేశారని పిటిఐ ఎక్స్‌లో పేర్కొంది.

హోం మంత్రిత్వ శాఖపైనే ఎక్కువ అవినీతి ఫిర్యాదులు

- సివిసి 2022 వార్షిక నివేదిక
- తరువాత స్థానాల్లో రైల్వే, బ్యాంక్ అధికారులు

న్యూఢిల్లీ : అవినీతి విషయంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ముందుంది. అవినీతి లేని ప్రభుత్వాన్ని నడుపుతున్నామని నిత్యం ప్రధాని నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్‌షా ప్రకటిస్తూ ఉంటారు. స్వయంగా అమిత్‌షా బాధ్యతలు నిర్వహిస్తున్న హోం శాఖకు సంబంధించిన అధికారులపై గత ఏడాది అధికంగా అవినీతి ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయాన్ని కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివిసి) 2022 వార్షిక నివేదిక వెల్లడించింది. తరువాత స్థానాల్లో రైల్వే, బ్యాంక్‌లకు చెందిన అధికారులు ఉన్నారు. 2022లో వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, సంస్థలకు చెందిన అధికారులు, ఉద్యోగులపై మొత్తంగా 1,15,203 అవినీతి ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 85,437 ఫిర్యాదులను పరిష్కరించారు. మరో 29,766 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిల్లో 22,034 ఫిర్యాదులు మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. గత ఏడాదిలో హోం మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులు, ఉద్యోగులపై మొత్తంగా 46,643 ఫిర్యాదులు వచ్చాయి. రైల్వే శాఖకు చెందిన ఉద్యోగులపై 10,580, బ్యాంకులు చెందిన ఉద్యోగులపై 8,129 ఫిర్యాదులు వచ్చాయి. హోం మంత్రిత్వ శాఖపై వచ్చిన ఫిర్యాదుల్లో 23,919 ఫిర్యాదులను పరిష్కరించగా, 22,724 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 19,198 ఫిర్యాదులు మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. రైల్వే అధికారులపై వచ్చిన ఫిర్యాదుల్లో 9,663ను పరిష్కరించారు. మరో 917 పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 9 ఫిర్యాదులు మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. బ్యాంకు ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదుల్లో 7,762ను పరిష్కరించారు. 367 పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 78 మూడు నెలలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. దేశ రాజధాని ప్రాంతం ఢిల్లీకి చెందిన ఉద్యోగులపై 7,370 అవినీతి ఫిర్యాదులు వచ్చాయి. బొగ్గు మంత్రిత్వ శాఖకు చెందిన ఉద్యోగులపై 4,304 ఫిర్యాదులు వచ్చాయి. కార్మిక మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 4,236 ఫిర్యాదులు, పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 2,617 ఫిర్యాదులు వచ్చాయి. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) ఉద్యోగులపై 2,150 ఫిర్యాదులు వచ్చాయి. రక్షణ మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 1,619 ఫిర్యాదులు, ఆర్థిక మంత్రిత్వ శాఖపై 1,202 ఫిర్యాదులు, కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సిబిఐసి) ఉద్యోగులపై 1,101 ఫిర్యాదులు వచ్చాయి. బీమా కంపెనీల ఉద్యోగులపై 987 ఫిర్యాదులు, కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదుల శాఖ ఉద్యోగులపై 970 ఫిర్యాదులు, ఉక్కు మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 923 ఫిర్యాదులు వచ్చాయి.

నైగర్‌లో మూడేళ్లలో పౌర పాలన

- సైనిక ప్రభుత్వ అధినేత జనరల్ చియాని వెల్లడి

నియామె: నైగర్ మూడేళ్లలో తిరిగి పౌర పాలన కిందికి వస్తుందని సైనిక ప్రభుత్వ అధినేత జనరల్ అబ్దోరహ్మాన్ చియాని ప్రకటించారు. అదే సమయంలో దేశ ఆంతరంగిక వ్యవహారాల్లో తల దూర్చాలని ప్రయత్నిస్తే తగిన బుద్ధి చెబుతామని పొరుగు దేశాలను హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన జాతి నుద్దేశించి టివిలో ప్రసంగిస్తూ, ఈ పరివర్తనకు అనుసరించాల్సిన నియమావళిని తన ప్రభుత్వం నెల రోజుల్లో ఖరారు చేస్తుందని అన్నారు. ఈ ప్రక్రియ అంతా పూర్తి కావడానికి మూడేళ్ల పడుతుందని అన్నారు. యుద్ధాన్ని తన ప్రభుత్వం కానీ, నైజీరియా ప్రజలు కానీ కోరుకోవడం లేదు, చర్చలకు తాము కట్టుబడి ఉన్నాం. దేశాన్ని ఆక్రమించాలని బయటి శక్తులు చేసే ఎలాంటి యత్నాన్ని అయినా తిప్పికొడతామని జనరల్ చియాని తెలిపారు. నైగర్‌లో జోక్యం చేసుకోవడం పార్కులో నడకలాంటిదని ఎవరైనా అనుకుంటే వారు పప్పులో కాలేసినట్టేనని ఆయన హెచ్చరించారు. ప్రస్తుత సంక్షోభం నుంచి దేశాన్ని బయట పడేసే మార్గాన్ని కనుగొనేందుకు ఇరుపక్షాలు కలిసి కూర్చొని చర్చించుకుంటాం. అందరి ప్రయోజనాలకు ఇది అవసరమని చియాని అన్నారు. శుక్రవారం పశ్చిమ

ఆఫ్రికా దేశాల కూటమి ఎకోవాస్ రాజకీయ వ్యవహారాలు, శాంతి, భద్రతల కమిషనర్ అబ్దుల్ ఫతువా మాట్లాడుతూ, నైగర్‌లో పౌర ప్రభుత్వాన్ని పునరుద్ధరించేందుకు సైనిక చర్యకు ముహూర్తం నిర్ణయించామని చెప్పారు. జోక్యానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కూటమిలోని 15 సభ్య దేశాలకు గాను 11 దేశాలు చెప్పాయని, అందుకు తమ బలగాలను పంపేందుకు సంసిద్ధత తెలిపాయని అన్నారు. నైగర్‌లో భ్రష్టు పట్టిన అధ్యక్షుడు బజూమ్‌ని తిరిగి ఎలాగైనా ప్రతిష్ఠించాలని ఫ్రాన్స్, అమెరికా, ఇయు దేశాలు అనేక విధాలుగా పాకులాడుతున్నాయి. ఎకోవాస్ కూటమి మాజీ వలస పాలకులైన ఫ్రాన్స్‌కు వత్తాసు పలుకుతోందని నైగర్, ఇతర సహేల్ ప్రాంతంలోని దేశాలు విమర్శించాయి. నైగర్‌లోని యురేనియం నిక్షేపాలను యథేచ్ఛగా కొల్లగొట్టుకుపోతున్న ఫ్రాన్స్‌కు ఇప్పుడు కొత్త ప్రభుత్వం బ్రేక్ వేసింది. దీంతో ఫ్రాన్స్‌లో అణు రియాక్టర్లకు చాలా ముఖ్యమైన ఇంధనం ఆగిపోతుంది. యురేనియం నిల్వలను తరలించుకుపోవడానికి గత ప్రభుత్వాలు అనుమతి ఇచ్చాయి. యురేనియం ఒక్కటే కాదు, లిథియం, బంగారం వంటి విలువైన ఖనిజ సంపదపైన మాజీ వలసపాలకుల ఆధిపత్యం ఇప్పటివరకు కొనసాగుతూ వస్తున్నది. ఈ పని కోసమే 1500 మంది సైనికులతో ఫ్రాన్స్, వెయి౬ య మంది సైనికులతో అమెరికా అక్కడ తిష్టవేశాయి. వనరుల తరలింపునకు అడ్డంకిగా ఉన్న సైనిక ప్రభుత్వాన్ని తప్పించేందుకు ఫ్రాన్స్, అమెరికా, ఇతర యూరోపియన్ దేశాలు, ఆఫ్రికాలో వాటికి తాబేదారుగా ఉన్న ఎకోవాస్ తమ యత్నాలను ముమ్మరం చేస్తున్నాయి. నైగర్‌పై ఆంక్షలు కూడా విధించాయి.

అయితే ఈ ఆంక్షలను తాము వ్యతిరేకిస్తున్నామని చాద్, గినియా దేశాల్లోని సైనిక ప్రభుత్వాలు హెచ్చరించాయి. బుర్కినా ఫాసో, మాలి ఇంతకుముందే ఈ విధమైన ప్రకటన చేశాయి. నైగర్‌లో సైనిక ప్రభుత్వాన్ని తొలగించేందుకు బయటి నుంచి జరిగే ఎటువంటి సైనిక జోక్యాన్ని తాము అనుమతించేది లేదని ఈ నాలుగు దేశాలు స్పష్టం చేశాయి.

పాక్‌లో ఉగ్రవాద దాడి

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లో ఆదివారం ఉగ్రవాదులు చేసినట్లు అనుమానిస్తున్న దాడిలో 11 మంది కార్మికులు మృతి చెందారు. కైబెర్ పఖ్తునంఖ రాష్ట్రంలో ఈ దారుణం జరిగింది. నిర్మాణ ప్రదేశానికి కార్మికులను తరలిస్తున్న ట్రక్కు కింద పేలుడు పదార్థాలు అమర్చి దానిని పేల్చివేశారు.

రేఖా నెం. 807/2023 SDT R&R తేదీ:18.08.2023.

కలెక్టర్ వారి కార్యాలయం, శ్రీకాకుళం

ఫారం – సి
నోటిఫికేషన్ ద్వారా పబ్లిక్ నోటీసు
(6/12 నియమం చూడండి)
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రెవెన్యూ (ఎల్.ఎ.) శాఖ

ప్రజా ప్రయోజనం అంటే రణస్థలం మండలం లోని పెద్ద కొవ్వాడ, చిన్న కొవ్వాడ, రామచంద్రాపురం, గూడెం, జీరుకొవ్వాడ మరియు టెక్కలి గ్రామాలకు సంబందించిన పి.డి.ఎఫ్., కుటుంబాలకు ఆర్ & ఆర్ కోలనీ నిర్మాణము కోసం ధర్మవరం గ్రామం ఎచ్చెర్ల మండలం శ్రీకాకుళం జిల్లాలోని మొత్తం ఎ.190.70 సెంట్లు భూమి అవసరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం/ కలెక్టరు భావిస్తున్నారు.

అందువల్ల, పైన పేర్కొనబడిన ప్రాజెక్టు కోసం ధర్మవరం గ్రామం ఎచ్చెర్ల మండలం శ్రీకాకుళం జిల్లాలో దాదాపు ఎ.190.70 సెంట్లు అంటే 77.21 హెక్టార్ల ప్రామాణిక కొలత గల భూమిని సేకరణ కోసం ప్రతిపాదించాడమయిందని ప్రకటించడమయింది. సవివర వివరణ ఈ క్రింది విధంగా ఉంది.

షెడ్యూలు

మండలం:ఎచ్చెర్ల — గ్రామం: ధర్మవరం

వరుస సంఖ్య	సర్వే నెం.	హక్కు రకం	భూమి రకం	సేకరణ క్రింద	ప్రయోజనం కల వ్యక్తి పేరు	హద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు వివరములు	కట్టడములు వివరములు
1	550-1	వారసత్వం	మెట్టు	10.00	దాట్ల గాయత్రి దేవి, భర్త లేటు సూర్యనారాయణ రాజు	339	బే ఆఫ్ బెంగాల్	550-2	549	జీడి చెట్లు-489, సరుగుడు-4, చింత-2, వేప-4, అకేషియా-1, తాటి చెట్లు-130	
2	550-2	వారసత్వం	మెట్టు	17.87	దాట్ల మెహర సీతారామ రాజు, తండ్రి సూర్యనారాయణ రాజు	339	బే ఆఫ్ బెంగాల్	550-3	550-1	జీడి చెట్లు-859, సరుగుడు-3, వేప-2, తాటి చెట్లు-2, అకేషియా-2	
3	550-3	వారసత్వం	మెట్టు	10.00	కలిదిండి శివరామ కృష్ణం రాజు, తండ్రి సీతారామ రాజు	339	బే ఆఫ్ బెంగాల్	550-4	550-2	జీడి చెట్లు-472	రేకుల పెద్దు గోడలు లేకుండా
4	550-4	వారసత్వం	మెట్టు	2.50	దాట్ల జయ, భర్త వెంకటపతి రాజు	339	బే ఆఫ్ బెంగాల్	550-5	550-3	జీడి చెట్లు-122	
5	550-4	వారసత్వం	మెట్టు	3.00	పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు తండ్రి వెంకట గోపాల కృష్ణం రాజు	339	బే ఆఫ్ బెంగాల్	550-5	550-3	జీడి చెట్లు-37,కొబ్బరి చెట్లు-198, నిమ్మ-162, రోజ్ ఆపిల్-2, సపోటా-4, జామి-7, మామిడి-17, రామ ఫలం-2, పనస-1, దబ్బ-1,	సోలార్ బావి-1, బోరు బావులు-2, రేకుల షెడ్డు -1
6	550-4	వారసత్వం	మెట్టు	1.50	పెనుమత్స మోహన్ మహేశ్వర రవికృష్ణ వర్మ తండ్రి దుర్గాప్రసాద్	339	బే ఆఫ్ బెంగాల్	550-5	550-3	సీతాఫలం-8, నిమ్మ-82, కొబ్బరి చెట్లు-99	
7	550-4	వారసత్వం	మెట్టు	0.75	చెల్లూరి మసేను తల్లి, భర్త పెద్ద నూకరాజు	339	బే ఆఫ్ బెంగాల్	550-5	550-3	జీడి చెట్లు-37, వేప-2, తాటి చెట్లు-1	
8	550-4	వారసత్వం	మెట్టు	0.75	చెల్లూరి చిన్న నూకరాజు, తండ్రి లేటు పైడయ్య	339	బే ఆఫ్ బెంగాల్	550-5	550-3	జీడి చెట్లు-36, వేప-2, తాటి చెట్లు-2	రేకుల షెడ్డు -1`, సిమెంట్ బావి-1
9	550-4	వారసత్వం	మెట్టు	0.75	పేర్ల పావని, భర్త రాము	339	బే ఆఫ్ బెంగాల్	550-5	550-3	జీడి చెట్లు-38, వేప-1, తాటి చెట్లు-1	
10	550-4	వారసత్వం	మెట్టు	0.75	గనగళ్ళ కోటేశ్వరరావు, తండ్రి లేటు నూకన్న	339	బే ఆఫ్ బెంగాల్	550-5	550-3	జీడి చెట్లు-39, వేప-1, తాటి చెట్లు-2	
11	550-5	వారసత్వం	మెట్టు	3.55	కస్తూరి వెంకట పద్మావతి భర్త క్రిష్ణ రావు	339	బే ఆఫ్ బెంగాల్	550-6	550-4	నిమ్మ-192, వేప-1, కొబ్బరి చెట్లు-234,	
12	550-5	వారసత్వం	మెట్టు	0.45	పెనుమత్స మోహన్ మహేశ్వర రవికృష్ణ వర్మ తండ్రి దుర్గాప్రసాద్ రాజు	339	బే ఆఫ్ బెంగాల్	550-6	550-4	నిమ్మ-25, కొబ్బరి చెట్లు-30	
13	550-5	వారసత్వం	మెట్టు	2.49	చెల్లూరి మసేను తల్లి, భర్త పెద్ద నూకరాజు	339	బే ఆఫ్ బెంగాల్	550-6	550-4	జీడి చెట్లు-117, వేప-1, తాటి చెట్లు-2	
14	550-5	వారసత్వం	మెట్టు	2.49	చెల్లూరి చిన్న నూకరాజు, తండ్రి లేటు పైడయ్య	339	బే ఆఫ్ బెంగాల్	550-6	550-4	జీడి చెట్లు-121, వేప-2, తాటి చెట్లు-1	
15	550-5	వారసత్వం	మెట్టు	2.48	పేర్ల పావని, భర్త రాము	339	బే ఆఫ్ బెంగాల్	550-6	550-4	జీడి చెట్లు-119, వేప-1, తాటి చెట్లు-2	
16	550-5	వారసత్వం	మెట్టు	2.48	గనగళ్ళ కోటేశ్వరరావు, తండ్రి లేటు నూకన్న	339	బే ఆఫ్ బెంగాల్	550-6	550-4	జీడి చెట్లు-124, వేప-1, తాటి చెట్లు-1	
17	550-6	వారసత్వం	మెట్టు	10.00	దాట్ల సీతారామ రాజు తండ్రి వెంకటపతి రాజు	339	బే ఆఫ్ బెంగాల్	550-7	550-5	జీడి చెట్లు-398, తాటి చెట్లు-3	
18	550-6	వారసత్వం	మెట్టు	0.99	చెల్లూరి మసేను తల్లి, భర్త పెద్ద నూకరాజు	339	బే ఆఫ్ బెంగాల్	550-7	550-5	జీడి చెట్లు-40	
19	550-6	వారసత్వం	మెట్టు	0.98	చెల్లూరి చిన్న నూకరాజు, తండ్రి లేటు పైడయ్య	339	బే ఆఫ్ బెంగాల్	550-7	550-5	జీడి చెట్లు-40	
20	550-6	వారసత్వం	మెట్టు	0.98	పేర్ల పావని, భర్త రాము	339	బే ఆఫ్ బెంగాల్	550-7	550-5	జీడి చెట్లు-40	
21	550-6	వారసత్వం	మెట్టు	0.98	గనగళ్ళ కోటేశ్వరరావు, తండ్రి లేటు నూకన్న	339	బే ఆఫ్ బెంగాల్	550-7	550-5	జీడి చెట్లు-40	
22	550-7	వారసత్వం	మెట్టు	10.00	దాట్ల బంగారమ్మ, భర్త నారాయణ రాజు	324	బే ఆఫ్ బెంగాల్	550-8	550-6	జీడి చెట్లు-426, వేప-3, అకేషియా-2, తాటి చెట్లు-3	
23	550-8	వారసత్వం	మెట్టు	15.56	దాట్ల జానకిరామ రాజు, తండ్రి నారాయణ రాజు	324	బే ఆఫ్ బెంగాల్	550-9	550-7	జీడి చెట్లు-667, నేరేడి-1, తాటి చెట్లు-4	రేకుల పెద్దు -1, బోరు బావి-1
24	550-8	వారసత్వం	మెట్టు	0.57	చెల్లూరి మసేను తల్లి, భర్త పెద్ద నూకరాజు	324	బే ఆఫ్ బెంగాల్	550-9	550-7	జీడి చెట్లు-23	
25	550-8	వారసత్వం	మెట్టు	0.57	చెల్లూరి చిన్న నూకరాజు, తండ్రి లేటు పైడయ్య	324	బే ఆఫ్ బెంగాల్	550-9	550-7	జీడి చెట్లు-23	
26	550-8	వారసత్వం	మెట్టు	0.58	పేర్ల పావని, భర్త రాము	324	బే ఆఫ్ బెంగాల్	550-9	550-7	జీడి చెట్లు-23	
27	550-8	వారసత్వం	మెట్టు	0.58	గనగళ్ళ కోటేశ్వరరావు, తండ్రి లేటు నూకన్న	324	బే ఆఫ్ బెంగాల్	550-9	550-7	జీడి చెట్లు-23	
28	550-9	వారసత్వం	మెట్టు	10.00	గణపతిరాజు సీతాదేవి, భర్త బంగార్రాజు	324	బే ఆఫ్ బెంగాల్	551	550-8	జీడి చెట్లు-464, సరుగుడు-4, తాటి చెట్లు-5	
29	552-1	వారసత్వం	మెట్టు	9.78	మైలపల్లి యేసుప్రసాద్, తండ్రి లేటు పోలీసు	551	బే ఆఫ్ బెంగాల్	552-2	551	జీడి చెట్లు-144, జీడి మొక్కలు-18, వేప-2, సరుగుడు-20, తాటి చెట్లు-10	
30	552-1	వారసత్వం	మెట్టు	2.00	బండి సత్యనారాయణ, తండ్రి లేటు అప్పల రాజు	551	బే ఆఫ్ బెంగాల్	552-2	551	జీడి చెట్లు-30, జీడి మొక్కలు-4, వేప-2, సరుగుడు-4, తాటి చెట్లు-6	
31	552-1	వారసత్వం	మెట్టు	1.50	కోల గురువులు, తండ్రి గురువులు	551	బే ఆఫ్ బెంగాల్	552-2	551	జీడి చెట్లు-22, జీడి మొక్కలు-3, వేప-2, సరుగుడు-4, తాటి చెట్లు-6	
32	552-1	వారసత్వం	మెట్టు	2.00	ముంగం చిన్నారావు, తండ్రి సూర్యారావు	551	బే ఆఫ్ బెంగాల్	552-2	551	జీడి చెట్లు-30, జీడి మొక్కలు-4, వేప-4, సరుగుడు-4, తాటి చెట్లు-6	బోర్ బావి-1
33	552-1	వారసత్వం	మెట్టు	4.00	సురాడ అప్పారావు, తండ్రి నూకరాజు	551	బే ఆఫ్ బెంగాల్	552-2	551	జీడి చెట్లు-60, జీడి మొక్కలు-7, వేప-2, సరుగుడు-10, తాటి చెట్లు-6	
34	552-2	వారసత్వం	మెట్టు	9.64	దాట్ల నారాయణ రాజు, తండ్రి సీతారామ రాజు	551	బే ఆఫ్ బెంగాల్	552-3	552-1	జీడి చెట్లు-178, జీడి మొక్కలు-56, వేప-23, సరుగుడు-15, తాటి చెట్లు-79, సీమ చింత-12	
35	552-3	వారసత్వం	మెట్టు	9.64	దాట్ల భాస్కర రాజు, తండ్రి విజయరామ రాజు	551	బే ఆఫ్ బెంగాల్	552-4	552-2	జీడి చెట్లు-254, జీడి మొక్కలు-34, వేప-15, తాటి చెట్లు-14, సీమ చింత-1	
36	552-4	వారసత్వం	మెట్టు	19.27	నడింపల్లి జ్యోతి, భర్త నారాయణ రాజు	551	బే ఆఫ్ బెంగాల్	552-5	552-3	జీడి చెట్లు-621, జీడి మొక్కలు-60, వేప-35, సరుగుడు-30, తాటి చెట్లు-88, నేరెడి-1, సీమ చింత-12, మర్రి-3	సిమెంట్ రేకుల షెడ్డు -1, సిమెంట్ బావి-1
37	552-5	వారసత్వం	మెట్టు	9.64	గొట్టిముక్కల శ్వేత, తండ్రి సీతారామ రాజు	551	బే ఆఫ్ బెంగాల్	552-6	552-4	జీడి చెట్లు-306, సీమ చింత-14, వేప-23, తాటి చెట్లు-76, తొగర-10, మర్రి-4	
38	552-6	వారసత్వం	మెట్టు	9.63	గణపతిరాజు సీతాదేవి, భర్త శ్రీరామచంద్ర రాజు	551	బే ఆఫ్ బెంగాల్	553	552-5	జీడి చెట్లు-196, జీడి మొక్కలు-36, వేప-42, తాటి చెట్లు-44, సీమ చింత-17, మర్రి-3	
				190.70							

పని గంటల సమయంలో ఏదేని పని దినాన జిల్లా కలెక్టరు కార్యాలయంలో భూమి ప్రణాళికను తనిఖీ చేయవచ్చు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం/ కలెక్టరు-కం-సముచిత ప్రభుత్వం, సదరు చట్టంలోని 12వ విభాగంలో పొందుపరచి మరియు నిర్దిష్టపరచినట్లుగా భూమిని సర్వే చేయడం, ఏదేని భూమిని చదునుచేయడం, భూమిని లోపలికి త్రవ్వడం లేదా బోర్లు వేయడం మరియు వారి పని యొక్క సక్రమమైన అమలు కోసం అవసరమైన అన్ని ఇతర చర్యలను చేపట్టి, వాటిని నమోదు చేయవలసినదిగా శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు, భూసేకరణ, ఎస్.పి.పి., కొవ్వాడ @ శ్రీకాకుళం అధీకృత అధికారిని మరియు అతని సిబ్బందిని కోరడమైనది.

చట్టంలోని 11(4) విభాగం క్రింద, కలెక్టరు పూర్వ ఆమోదం లేకుండా అట్టి ప్రకటనను ప్రచురించిన తేదీ నుండి ఏదేని లావాదేవి లేదా ఏదేని భూమి యొక్క లావాదేవీల కారణం అంటే, అమ్మకం / కొనుగోలు మున్నగునవి లేదా అట్టి భూమిపై ఏవేని తాకట్టులను సృష్టించడం ఏ వ్యక్తి చేయరాదు.

సేకరణకు సంబందించిన ఏవేని ఆక్షేపణలు ఉన్నట్లయితే, నష్టపరిహారానికి సంబంధించి సంప్రదింపుల ద్వారా పరిష్కారం కోసం చట్టంలోని 15 వ విభాగం క్రింద పొందుపరచినట్లుగా ఈ ప్రకటనను ప్రచురించిన తేదీ నుండి 15 (పదిహేను) రోజుల లోపల ప్రయోజనం ప్రభావితమైన వ్యక్తిచే క్లెయిములను జిల్లా కలెక్టరు / అధీకృత అధికారి సమక్షంలో దాఖలు చేయవచ్చు.

ప్రదేశం: శ్రీకాకుళం
తేదీ.18.8.2023

సం/-శ్రీకేష్ లాఠకర్
జిల్లా కలెక్టరు, శ్రీకాకుళం

మీకోసం

వెన్నలోంచి చెడువాసన వస్తుంటే కరివేపాకు, కొత్తిమీర కరగ బెట్టేముందే కలపాలి. ఆ తరువాత ఫిల్టర్ చేస్తే నెయ్యి రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

గొంతు పెంచడం కాదు.. మాట విలువ పెంచుకోవాలి.. వాన చినుకులకే పంట పండుతుంది. ఉరుములకు కాదు..

చుక్కల లోకం వెళ్దొద్దామా?

చుక్కల లోకం వెళ్దొద్దామా
చక్కని జాబిలి చూసొద్దామా
అంతుచిక్కని రహస్యాలనూ,
వింత దృశ్యాలు తిలకిద్దామా?

మేఘాల్లో దాక్కుందామా
వెన్నెల వానలో తడిచేద్దామా
చుక్కల మెరుపులతో జత కట్టి
మిక్కిలి మోదం పొందెద్దామా?

చంద్రుని ఒడిలో పవళిద్దామా
ఇంద్రుని వాహనం ఎక్కేద్దామా
మబ్బుల తేరు లాగేద్దామా
దబ్బున ఊరు చేరేద్దామా?

– గద్వాల సోమన్న,
99664 14580

సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ గజిబిజిగా ఇచ్చిన పదాలను సరైన క్రమంలో రాస్తే అర్థవంతమైన పదాలు వస్తాయి. ట్రై చేయండి..

తప్పు పదం	సరియైన పదం
గటుస	
యోప్రగం	
తవిజే	
లిఘతం	
పఆద	

నేను గీసిన బొమ్మ

జి సురేఖ,
8వ తరగతి,
డివిఐ పబ్లిక్ స్కూల్.

ఆమె ముఖంలో సంతోషం చూడాలని ...

కేరళ కొచ్చిలోని ఓ హోటల్‌లో సుస్మిత పనిచేస్తోంది. బతుకుతెరువు కోసం మణిపూర్ నుండి కేరళకు ఆమె వలసొచ్చింది. 7 నెలల క్రితమే ఈ పనిలో చేరి ఎంతో ప్రతిభ చూపుతోంది. కష్టం తెలిసిన మనిషిలా.. జీవితంలో ఏదైనా సాధించాలన్న తపనతో ఉండే ఆమెను హోటల్ సిబ్బంది ఎంతో అభిమానించేవారు. ఆ రోజు.. ఎప్పుడూ సరదాగా ఉండే తను ఎందుకో చాలా నిరాశగా కనిపించింది. ఏదో బెంగ ఆమె ముఖంలో కొట్టొచ్చినట్టు కనపడుతోంది. అది గమనించిన హోటల్ జనరల్ మేనేజర్ చూస్తూ ఊరుకోలేకపోయారు. విషయం అడిగి తెలుసుకుని ఆమె బాధను తీర్చాడు.. ప్రముఖ చెఫ్ పిళ్లై తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన సుస్మిత కథ ఇప్పుడు బాగా వైరల్ అవుతోంది. అదేంటో మనమూ తెలుసుకుందాం.

భర్తను కోల్పోయిన తల్లి, ఇద్దరు ఆడబిడ్డలను పెంచేందుకు ఎంతో శ్రమపడింది. అమ్మను ఇక కష్టపెట్టడం ఇష్టం లేని పెద్ద కూతురు సుస్మిత చదువు పూర్తవ్వగానే ఉద్యోగం వెతుక్కుంటూ వేల కిలోమీటర్లు దాటి కేరళ కొచ్చికి చేరుకుంది. తన సంపాదన మీదే కుటుంబం జీవిస్తోంది. సాఫీగా సాగిపోతున్న వాళ్ల జీవితంలో మణిపూర్ మారణహోమం పెద్ద ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. మే 3న చెలరేగిన మణిపూర్ అల్లకల్లోలంలో సుస్మిత అమ్మ, చెల్లి చిక్కుకుపోయారు. ఆ అల్లర్లలో తన తల్లి, చెల్లి ప్రాణాలను ఎక్కడ కోల్పోతానోనని సుస్మిత బెంగ పడింది. తను వెళ్లలేదు. వాళ్లను ఇక్కడకు రప్పించడం తెలియదు. వాళ్లనే తలచుకుంటూ.. తన నిస్సహాయతను నిందించుకుంటూ ఆ రోజు దిగులుగా ఉంది. ఇదంతా మేనేజర్‌తో చెప్పుకుంది.

తన కష్టం విన్న మేనేజర్ తన సిబ్బందితో సుస్మిత అమ్మ, చెల్లి కొచ్చికి వచ్చే ఏర్పాట్లు చేయమన్నారు. దీనంతటికీ ముందు.. సుస్మిత గురించి మరో విషయం మనం చెప్పుకోవాలి. ఏడు నెలల వ్యవధిలో సుస్మిత మూడు సార్లు 'ఉత్తమ ఉద్యోగి' అవార్డును సాధించింది.

మణిపూర్‌లో రోజురోజుకూ పరిస్థితులు చేయిదాటుతున్న వేళ.. హోటల్ సిబ్బంది ఏమాత్రం ఆలోచించకుండా.. ఆగమేఘాల మీద సుస్మిత అమ్మా, చెల్లి కొచ్చికి వచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఇక్కడకు వచ్చాక కూడా వసతి చూశారు. అంతేకాదు, కొన్ని రోజుల తరువాత వారిద్దరినీ హోటల్‌కు రమ్మని ఇంటర్వ్యూ చేశారు. 'వాళ్లు ఇప్పటి వరకు మణిపూర్ వదిలి బయటకు రాలేదు. వాళ్లకు హిందీ, ఇంగ్లీషు రెండూ తెలియదు. అయినా వాళ్లు ఇంట్లో ఖాళీగా కూర్చోవడం తెలియదన్నారు. వాళ్లకు ఏదైనా పని అప్పజెప్పితే బాధ్యతగా చేస్తారనిపించింది. సుస్మిత చెల్లిని హోటల్‌లో ట్రైనీ చెఫ్‌గా, ఆమె తల్లిని సిబ్బందికి సహాయకురాలిగా నియమించాం. ఇప్పుడు ఆ కుటుంబం చాలా సంతోషంగా, రక్షణలో నివసిస్తోంది. ఇప్పుడు సుస్మిత ముఖంలో కూడా మునుపటి సంతోషం, ఉల్లాసం చూస్తున్నాం' అంటూ చెఫ్ పిళ్లై తన ఇన్‌స్టాలో ఈ స్టోరీని షేర్ చేశారు. షేర్ చేసిన గంటల వ్యవధిలోనే సిబ్బంది పట్ల పిళ్లై హోటల్ యాజమాన్యం చూపించిన దయాగుణానికి ఎంతోమంది అభిమానిస్తున్నారు.

పుట్టగొడుగుల్లో పోషకాలు పుష్కలం

ఈ సీజన్‌లో సహజసిద్ధంగా లభించే పుట్టగొడుగుల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎక్కువగా పుట్టలపై గొడుగు ఆకారంలో మొలుస్తాయి. అందువల్ల వీటిని పుట్టగొడుగులు అని అంటారు.

పుట్టగొడుగుల్లో సెలీనియం, విటమిన్ సి, కోలిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. యాంటీ ఆక్సిడెంట్లతో పాటు, పుట్టగొడుగుల్లో ప్రోటీన్, బి–కాంప్లెక్స్ విటమిన్లు, ఫైబర్ కూడా ఉంటాయి. ఈ పోషకాలన్నీ కలిసి కణం, కణజాల నష్టాన్ని నిరోధించడంలో సహాయపడతాయి. రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తాయి.

ఇందులో ఉండే విటమిన్ డి ఎముకలు, కీళ్ల సమస్యల పరిష్కారానికి దోహదపడుతుంది. పుట్టగొడుగుల్లో ఎర్గోస్టెరాల్ అనే 'ప్రోవిటమిన్' ఉంటుంది. ఇవి సూర్యరశ్మికి గురైన తర్వాత విటమిన్ డిగా మారుతుంది. విటమిన్ డి సాంద్రతను పెంచడంలో ఇది సహాయపడుతుంది.

పుట్టగొడుగుల్లో యాంటీఆక్సిడెంట్లు, బి–కాంప్లెక్స్ విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ఈ పోషకాలు మన కణాలను దెబ్బతినకుండా రక్షించడానికి అధ్యయనం చేయబడుతున్నాయి. కణితి ఏర్పడకుండా నిరోధించొచ్చు.

బీటా–గ్లూకాన్ అనేది పుట్టగొడుగుల్లో సాధారణంగా కనిపించే ఒక కరిగే ఫైబర్. ఈ కరిగే ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఆచరణాత్మకంగా, గ్లుటామేట్ రిబోన్యూక్లియోటైడ్ల ఉనికి కారణంగా పుట్టగొడుగులను సులభంగా ఉప్పుతో భర్తీ చేయొచ్చు. ఈ సమ్మేళనాలు పుట్టగొడుగుల ఉప్పు, ఉమామి రుచికి కారణమవుతాయి. ఈ ఫంక్షన్ గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

పుట్టగొడుగుల్లో గ్లూటాతియోన్, విటమిన్ సి, సెలీనియం వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మంపై ముడతలు రాకుండా సహాయపడతాయి.

దుస్తులు వాసన రాకుండా ఇలా...

వర్షాకాలంలో తరచూ వర్షాలు పడుతూనే ఉంటాయి. ఈ సమయంలో బట్టలు ఎండడం అనేది చాలా కష్టం అవుతుంది. ఈ క్రమంలో ఇంట్లోనే ఉతికిన బట్టల్ని ఆరేస్తుంటారు. అయితే ఆ దుస్తులు సరిగ్గా ఆరక వాటి నుంచి దుర్వాసన రావడం మొదలవుతుంది. దీనితో ఇల్లంతా అదే వాసనతో నిండిపోతుంది. ఈ చిట్కాలు పాటిస్తే దుర్వాసన పోతుంది.

- సరిగ్గా ఆరని దుస్తుల నుంచి వచ్చే దుర్వాసనను నిమ్మరసంతో దూరం చేసుకోవచ్చు.
- ముందుగా ఓ స్ప్రే బాటిల్‌లో కాస్త నిమ్మరసంతో నింపుకోవాలి. ఆ తర్వాత వాసన వచ్చే దుస్తులపై ఈ మిశ్రమాన్ని స్ప్రే చేసి కాసేపు అలాగే గాలిలో ఆరేయాలి.
- వెనిగర్ అలాగే బేకింగ్ సోడా బట్టల నుంచి వచ్చే దుర్వాసనను తొలగించేస్తాయి.
- బట్టలను ఉతికేటప్పుడు కాస్తంత వెనిగర్‌ని అలాగే బేకింగ్ సోడాను డిటర్జెంట్‌లో కలిపితే చెడు వాసన రాదు.
- బట్టలను ఉతికే ముందు చాలా సేపు నానబెట్టడం చేస్తే దుర్వాసన వస్తుంది. కాబట్టి వెంటనే ఉతుక్కోవాలి.
- బయటికి వెళ్లి వచ్చిన తరువాత వానలో తడిసిన దుస్తుల్ని అలాగే పక్కన పెట్టకుండా గాలికి ఆరేయాలి.
- అలాగే ఉతికిన బట్టలను ఎక్కువసేపు ఆరబెట్టకుండా వెంటనే ఆరేయాలి.

దక్షిణాది సినిమాకు పెరుగుతున్న ఆదరణ

కొంతకాలంగా దక్షిణాది సినిమాలకు దేశవ్యాప్తంగా క్రేజ్ పెరుగుతోంది. థియేటర్లలోనే కాదు; హిందీలో డబ్ చేసి యూట్యూబ్‌లో పెట్టిన తెలుగు సినిమాలకు మిలియన్స్ వ్యూవ్ వస్తున్నాయి. గతంలో చిరంజీవి తమిళ్ సినిమా జెంటిల్‌మెన్‌ని హిందీలో రీమేక్ చేశారు కానీ అక్కడ విజయం సాధించలేదు. ఇంకొన్ని సినిమాలని కూడా హిందీ ప్రేక్షకులు తిరస్కరించారు. టాలీవుడ్ నుంచి నాగార్జున, ఎన్టీఆర్, వెంకటేష్ లాంటి హీరోల మూవీస్‌ని కూడా అడపాదడపా హిందీలోకి డబ్ చేసినా సరైన విజయాలు అందుకోలేదు.

ఇప్పుడు ట్రెండ్ మారింది. మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, ప్రభాస్ లాంటి సినిమాలను హిందీ ప్రేక్షకులు ఇష్టంగా చూస్తున్నారు. బోయపాటి దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన సరైనోడు సినిమాను బాగా ఆదరించారు. హిందీలో డబ్ చేసి యూట్యూబ్‌లో పెట్టిన సరైనోడి సినిమాకి 82 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. త్రివిక్రమ్ దర్శకత్వంలో నితిన్, సమంత హీరో హీరోయిన్‌లు నటించిన చిత్రం అ ఆ... ఈ సినిమాలో అప్పట్లోనే 50 కోట్లకు పైనే వసూలు చేసింది. దీన్ని హిందీలో డబ్ చేసి యూట్యూబ్‌లో పెడితే.. దాదాపు 457 మిలియన్ వ్యూస్ వచ్చాయి. నితిన్ మరో సినిమా చెక్‌కి 157 మిలియన్ వ్యూస్ వచ్చాయి.

రామ్ చరణ్, జెనీలియా హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం ఆరెంజ్. మగధీర తర్వాత వచ్చిన ఈ ప్రేమకథ చిత్రమిది. తెలుగు ప్రేక్షకులని అంతగా ఆకట్టుకోలేకపోయింది. కానీ టీవీలలో ప్రసారం అయ్యేసరికి బాగా ఆకట్టుకుంది. హిందీలో డబ్ చేసిన ఈ సినిమాని 228 మిలియన్ల మంది యూట్యూబ్‌లో వీక్షించారు. ధ్రువ సినిమాకి 21 మిలియన్ వ్యూస్ వచ్చాయి. కార్తికేయ హీరోగా నటించిన రాజ మిక్రమార్కకి 35 మిలియన్ వ్యూస్.. రామ్ హీరోగా నటించిన ఉన్నది ఒక్కటే జిందగి తెలుగులో మంచి సక్సెస్ సాధించింది. ఈ సినిమాని హిందీలో డబ్ చేసి.. నంబర్ వన్ దిల్ వాలా పేరుతో యూట్యూబ్‌లో పిడితే 257 మిలియన్ల మంది చూశారు. అల్లు అర్జున్ రేసుగుర్రం, మహేష్ బాబు శ్రీమంతుడు, ఎన్టీఆర్ టెంపర్‌తో పాటు.. బెల్లంకొండ శ్రీనివాస్ సినిమాలని హిందీలో డబ్ చేస్తే కోట్ల మంది చూస్తున్నారు. చిరంజీవి 'గాడ్ ఫాదర్'లో సల్మాన్ ఖాన్ నటించారు. హిందీ మార్కెట్‌లో పెద్ద సక్సెస్‌కి కారణమైంది.

టాలీవుడ్ , కోలీవుడ్‌లలో సమంత ,నయనతార, రష్మిక , పూజా హెగ్డే తమ ట్యాలెంట్‌తో బాలీవుడ్‌లో సత్తా చాటుతున్నారు. పలు బాలీవుడ్ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నారు నయనతార. అట్లీ దర్శకత్వంలో షారుఖ్ ఖాన్ సినిమా జవాన్‌లో హిందీ మూవీలో నయనతార కథానాయిక. హీరోయిన్ సమంత కథానాయికగా తెరకెక్కిన యశోద, శాకుంతలం, ఖుషిలో సమంత కథానాయిక. ఫ్యామిలీ మ్యాన్ 2 హిందీ వెబ్ సిరీస్‌తో బాలీవుడ్‌కు పరిచయమైన సమంత అమెరికన్ వెబ్ సిరీస్ సిటాడెల్ ఆధారంగా తెరకెక్కించే హిందీ వెబ్ సిరీస్‌లో రా ఏజెంట్‌గా నటించారు. బాలీవుడ్‌లో పలు అవకాశాలు సమంత అందుకుంటున్నట్టు సమాచారం. పూజా హెగ్డే సర్కస్ , కిసీ కా భాయ్ కీసీ కా జాన్ (హిందీ) మూవీస్‌లో నటించారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేష్‌బాబు హీరోగా తెరకెక్కుతున్న ఎస్ఎస్ఎంబి 28లో పూజా హెగ్డే కథానాయిక. శివ దర్శకత్వంలో తమిళ మూవీలో సూర్యకు జోడీగా పూజా హెగ్డే ఎంపికయ్యారు. పుష్పలో నటించిన రష్మిక ఆ మూవీ హిందీ వెర్షన్‌తో నార్త్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అమితాబ్, రష్మిక ప్రధాన పాత్రలలో తెరకెక్కిన గుడ్ బై హిందీ మూవీతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. రష్మిక తెలుగు, తమిళ భాషలలో వారసుడు, రణ్ బీర్ కపూర్ యానిమల్, టైగర్ ష్రాఫ్ స్క్రూ ఢీలా బాలీవుడ్ మూవీస్‌లో కథానాయికగా నటిస్తున్నారు. రష్మిక కథానాయికగా రూపొందిన బాలీవుడ్ మూవీ మిషన్ మజ్నులో అలరించింది.

సిరీస్ సొంతమాయె

- రెండో టీ20లో భారత్ గెలుపు
- రాణించిన రుతురాజ్, బుమ్రా

డబ్లిన్ : టీ20 సిరీస్ భారత్ వశం. రెండో టీ20లోనూ ఐర్లాండ్‌ను చిత్తు చేసిన టీమ్ ఇండియా 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 2–0తో మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 185 పరుగులు చేసింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (58, 43 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), సంజు శాంసన్ (40, 26 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (38, 21 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), శివం దూబె (22 నాటౌట్, 16 బంతుల్లో 2 సిక్స్‌లు) రాణించారు. తెలుగు తేజం తిలక్ వర్మ (1) నిరాశపరిచాడు. భారీ ఛేదనలో ఐర్లాండ్ పోరాట స్ఫూర్తి చూపించింది. ఓపెనర్ ఆండీ బాల్‌బిర్నీ (72, 51 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో పోరాడాడు. మరో ఎండ్ నుంచి భారత బౌలర్లు బుమ్రా (2/15), ప్రసిద్ (2/29), బిష్ణోయ్ (2/37) వికెట్లు పడగొట్టారు. చివర్లో మార్క్ ఎడెర్ (23) ఆకట్టుకున్నా.. 20 ఓవర్లలో ఐర్లాండ్ 8 వికెట్లకు 152 పరుగులే చేసింది. సిరీస్‌లో నామమాత్రపు మూడో టీ20 బుధవారం జరుగుతుంది.

చాంపియన్ స్పెయిన్

- ఫైనల్లో ఇంగ్లాండ్‌పై 1–0తో గెలుపు
- మహిళల ఫిఫా ప్రపంచకప్ 2023

సిడ్నీ (ఆస్ట్రేలియా) : స్పెయిన్ నాయకి ఓల్గా కార్మోనా అదరగొట్టింది. ఆదివారం సిడ్నీలో జరిగిన మహిళల ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో కండ్లుచెదిరే గోల్‌తో మెరిసిన ఓల్గా.. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో స్పెయిన్‌కు తొలి టైటిల్ అందించింది. 2017లో జర్మనీ తర్వాత ఫిఫా ప్రపంచకప్ ముద్దాడిన తొలి యూరోపియన్ జట్టుగా సైతం స్పెయిన్ చరిత్ర సృష్టించింది. ఇంగ్లాండ్, స్పెయిన్ మధ్య హోరాహోరీగా సాగిన టైటిల్ పోరులో 29వ నిమిషంలో ఓల్గా గోల్ కొట్టింది. ఎడమ కాలు కిక్‌తో బంతిని ఇంగ్లాండ్ గోల్ పోస్ట్ కార్నర్‌లోకి పంపించిన ఓల్గా.. స్పెయిన్‌లో సంబురాలకు తెరలేపింది. 68వ నిమిషంలో మరో గోల్ సాధించే అవకాశం సైతం స్పెయిన్‌కు లభించినా ఇంగ్లాండ్ గోల్‌కీపర్ అడ్డుకుంది. జెన్నీ హెర్మోస్ పెనాల్టీ కిక్‌ను లెఫ్ట్ సైడ్ డైవ్‌తో ఇంగ్లాండ్ గోల్‌కీపర్ నిలువరించింది. మానసిక ఆరోగ్యం, మరింత మెరుగైన ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ అంశాలపై గత ఏడాది స్పెయిన్ మహిళా అథ్లెట్లు జాతీయ జట్టు నుంచి తప్పుకుని సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. జాతీయ జట్టులో సుమారుగా ఓ ముసలం పుట్టిన ఏడాది లోపే స్పెయిన్ చారిత్రక ఫిఫా ప్రపంచకప్ విజయాన్ని సాధించటం గమనార్హం. మ్యాచ్‌లో 58 శాతం బంతిని స్పెయిన్ నియంత్రణలో ఉంచుకుంది. 13 సార్లు స్పెయిన్ గోల్ ప్రయత్నాలు చేయగా.. ఐదుసార్లు నేరుగా గోల్‌పోస్ట్‌పైకి దూసుకెళ్లాయి. ఇంగ్లాండ్ ఎనిమిది సార్లు గోల్ కోసం ప్రయత్నించగా.. మూడు సార్లు టార్గెట్‌కు చేరువగా వెళ్లారు. అమెరికా (4), జర్మనీ (2), నార్వే (1), జపాన్ (1) తర్వాత ఫిఫా ప్రపంచకప్‌ను సాధించిన ఐదో జట్టుగా స్పెయిన్ నిలిచింది.

ఉత్తరాంధ్ర లయన్స్ విజయం

వరుసగా మూడో గెలుపు

ప్రజాశక్తి – పిఎం.పాలెం (విశాఖపట్నం)

విశాఖ పిఎం పాలెం సమీపంలోని ఎసిఎ – విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం వైజాగ్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలుచుకున్న వైజాగ్ వారియర్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాంధ్ర లయన్స్ బ్యాట్స్‌మెన్‌లు 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 206 పరుగులు సాధించారు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన గుల్ఫామ్ సలేహ్ నిరుత్సాహపరిచారు. కెఎస్.భరత్, మూడో స్థానంలో దిగిన ఎస్‌వి రాహుల్ బ్యాటింగ్‌తో అలరించారు. కెప్టెన్ భరత్ ఈ మ్యాచ్‌లోనూ అద్భుతంగా రాణించారు. 23 బంతుల్లో 4 సిక్స్‌లు, 3 ఫోర్‌లతో 45 పరుగులు చేశారు. ఎస్‌వి.రాహుల్ 36 బంతుల్లో 3 సిక్స్‌లు, 3 ఫోర్‌లతో 53 పరుగులు చేసి శభాష్ అనిపించుకున్నారు. వీరిద్దరూ 59 బంతుల్లో 98 పరుగులు చేసి మంచి భాగస్వామ్యాన్ని నిర్మించారు. అనంతరం పి.తపస్వి 23 బంతుల్లో 2 సిక్స్‌లు, 4 ఫోర్‌లతో 38 పరుగులు, ఎస్‌హెచ్.శ్రీనివాస్ 13 బంతుల్లో 4 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 33 పరుగులు సాధించారు. వీరిద్దరూ కలిసి 36 బంతుల్లో 71 పరుగులతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. మొత్తంగా 20 ఓవర్లలో ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వైజాగ్ వారియర్స్ క్రీడాకారులు 14.4 ఓవర్లకు 113 పరుగులు చేసి ఆలౌటయ్యారు. బౌలింగ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ బౌలర్లు వై.పృథ్వీరాజ్ కేవలం 1.4 ఓవర్లలో 7 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు కూలగొట్టారు. పి.తేజస్వి 4 ఓవర్లలో 29 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసుకున్నారు. ఈ మ్యాచ్ విజయంతో ఉత్తరాంధ్ర లయన్స్ టీమ్ వరుసగా మూడు విజయాలను సొంతం చేసుకుంది. ఎస్‌వి.రాహుల్ అర్ధ సెంచరీతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు.

బ్యాటింగ్‌లో అర్ధ సెంచరీతో అదరగొట్టిన ఎస్‌వి.రాహుల్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68